

APTEL/26/A4813

# శ్రీ వార్త

జాతీయ తెలుగు దినపత్రిక

కొత్త ఆలోచన.. కొత్త వార్త




సంపుటి : 01 సంచిక :43 ఎడిటర్.: కూరేటి సతీష్ పేజిలు : 08, వెల రూ. 2రూ/ శుక్రవారం - 21 - ఆగష్టు - 2026

Published From : Circulated at Srikakulam,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna, Guntur, Prakasam, Nellore, Chittoor,, Kadapa, Anantapuram, Hyderabad


## విభజన సమస్యల పరిష్కారానికి

# కేంద్రం చొరవ చూపాలి

### మహాబలిపురంలో జరిగిన సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశం

- ★సదరన్ జోనల్ కౌన్సిల్‌లో చంద్రబాబు ప్రసంగానికి దక్షిణాది సీఎంల ప్రశంసలు
- ★దక్షిణాది అభివృద్ధికి బ్లూప్రింట్ సమర్పించిన సీఎం చంద్రబాబు
- ★కుప్పం మీదుగా బుల్లెట్ ట్రైన్, గోదావరి-కావేరి అనుసంధానంపై కీలక ప్రతిపాదనలు
- ★చంద్రబాబు ప్రసంగంపై దక్షిణాది సీఎంల ప్రశంసలు



అమరావతి: కేంద్ర హోంమంత్రి అమిత్ షా అధ్యక్షతన మహాబలిపురంలో జరిగిన 31వ సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు మిగతా 2 లో

## శాసనమండలిలో మంత్రి లోకేశ్ ప్రవేశపెట్టిన 5 బిల్లులకు ఏకగ్రీవ ఆమోదం



- ●శాసనమండలిలో 5 కీలక బిల్లులు ప్రవేశపెట్టిన మంత్రి లోకేశ్
- ●విద్యా, గ్రంథాలయ, నైపుణ్య రంగాలకు సంబంధించిన బిల్లులు
- ●ఆమోదం పొందిన వాటిలో ప్రైవేటు స్కిల్ వర్సిటీల బిల్లు కూడా ఉంది

అమరావతి: ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో పలు కీలక బిల్లులకు ఆమోదం లభించింది. రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి మిగతా 2 లో

## తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ.. దర్శనానికి 18 గంటల సమయం



- ●శిలాతోరణం వరకు విస్తరించిన సర్వదర్శనం క్యూలైన్లు
- ●నిన్న స్వామివారిని దర్శించుకున్న 76,464 మంది భక్తులు
- ●హుండీ ద్వారా రూ. 4.94 కోట్ల ఆదాయం

తిరుపతి: తిరుమల శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని కంపార్ట్‌మెంట్లన్నీ పూర్తిగా నిండిపోవడంతో, సర్వదర్శనం క్యూలైన్లు వెలుపల వరకు మిగతా 2 లో

## అక్టోబర్ 1 నుంచి ఎస్‌బీఐ కొత్త రూల్.. ఐదోసారి డబ్బు తీస్తే..!




- ●అక్టోబర్ 1 నుంచి బీఎస్‌బీడీ ఖాతాలకు కొత్త నిబంధనలు
- ●నెలలో నాలుగు నగదు ఉపసంహరణలు మాత్రమే ఉచితం
- ●ఐదో ఉపసంహరణ నుంచి రూ.15తో పాటు జీఎస్‌టీ
- ●లెక్కలోకి ఏటీఎం, శాఖలో చేసిన, ఏఈపీఎస్ లావాదేవీలు
- ●డిజిటల్ లావాదేవీల మినహాయింపును తొలగించిన ఎస్‌బీఐ



## రాహుల్ గాంధీకి హరీశ్ రావు లేఖ.. పొంగులేటిని మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్

- ▶22ఏ పేరుతో రెవెన్యూ శాఖలో దందాలు, వేధింపులు సాగుతున్నాయన్న హరీశ్
- ▶ప్రైవేట్ ఆస్తులపై కృత్రిమ వివాదాలు సృష్టిస్తున్నారని మండిపాటు
- ▶రెవెన్యూ శాఖలో 30 శాతం కమీషన్ల రాకెట్ నడుస్తోందని ఆరోపణ

హైదరాబాద్: తెలంగాణలోని రెవెన్యూ శాఖలో నిషేధిత భూముల (22ఏ) పేరుతో బహిరంగంగా దందాలు, వేధింపులు సాగుతున్నాయని ఆరోపిస్తూ కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి మాజీ మంత్రి, మిగతా 2 లో

## దక్షిణాది రాష్ట్రాలు ఏకతాటిపైకి రావాలి.. మన మధ్య బలమైన సహకారం అవసరం: సీఎం విజయ్

దక్షిణాది రాష్ట్రాల మధ్య సహకారం పెరగాలన్న సీఎం విజయ్

డ్రగ్స్ రహిత దక్షిణ భారతం కోసం కలిసికట్టుగా పనిచేద్దామని పిలుపు

ఆర్థిక కూటమిగా ఏర్పడి ప్రయోజనాలు కాపాడుకోవాలని సూచన



తమిళనాడు: డ్రగ్స్ రవాణాపై ఉమ్మడి పోరాటం, ఆర్థిక కారిడార్ల నిర్మాణం, బ్లూ ఎకానమీ విస్తరణ, దక్షిణాది రాష్ట్రాల ఉమ్మడి ప్రయోజనాల పరిరక్షణ కోసం అన్ని రాష్ట్రాలు సహకారంతో ముందుకు సాగాలని తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ పిలుపునిచ్చారు మిగతా 2 లో

## ‘ఇందిరమ్మ’ రెండో విడతకు

# వేగంగా కసరత్తు

### ఒక్కో నియోజకవర్గంలో 2,500 మందికి కేటాయింపులు

- ➤వచ్చే నెల 15 నాటికి ఇళ్ల లబ్ధిదారులకు పత్రాలు
- ➤ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే 2.50 లక్షల ఇళ్లను పేదలకు పంపిణీ చేయాలని ప్రభుత్వం లక్ష్యం
- ➤ రాష్ట్రవ్యాప్తంగా 50 వేల మంది వరకు గుడిసెల్లో నివసిస్తున్నట్లు అధికారుల సర్వే
- ➤రెండో విడతలో వీరందరికీ మొదటి ప్రాధాన్యం ఇవ్వనున్నారు




హైదరాబాద్: ఇందిరమ్మ ఇళ్ల పథకం రెండో విడత లబ్ధిదారులను సెప్టెంబరు 15 నాటికి ఎంపిక చేసి, మంజూరు పత్రాలు అందించేలా హౌసింగ్ కార్పొరేషన్ ఏర్పాట్లు చేస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే 2.50 లక్షల ఇళ్లను పేదలకు పంపిణీ చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. క్యూర్ పరిధి మినహాయించి రాష్ట్రంలోని 100 నియోజకవర్గాల్లో మిగతా 2 లో

## ‘శుద్ధీకరణ’ ఘటనపై ఖర్గే ఆవేదన.. పార్టీ నేతల మౌనంపై అసంతృప్తి

హల్వానీ శుద్ధీకరణ ఘటనపై సీడబ్ల్యూసీలో ఖర్గే ఆవేదన

తనకు పార్టీ నేతల నుంచి తగిన మద్దతు రాలేదని అసంతృప్తి

సభా వేదిక శుద్ధీకరణ తనను అవమానించిందని రాజ్యసభలో ఆవేదన

బాధ్యులపై అంటరానితనం నిరోధక చట్టం కింద చర్య తీసుకోవాలని విన్నపం



## గ్రూప్-1పై విచారణకు మేము రెడీ.. డీఎస్సీపై సీబీఐ విచారణకు మీరు సిద్ధమా?

### లోకేశ్‌ను కాపాడేందుకే గ్రూప్-1పై తప్పుడు ప్రచారమన్న జగన్

- ▸▸ చంద్రబాబుకు జగన్ సవాల్
- ▸▸గ్రూప్-1 నోటిఫికేషన్ విడుదల, ప్రిలిమ్స్ టీడీపీ హయాంలోనే జరిగాయని వెల్లడి
- ▸▸హైకోర్టు ఆదేశాలతోనే మాన్యువల్ మూల్యాంకనం చేశామని స్పష్టీకరణ
- ▸▸హాయ్‌ల్యాండ్‌లో మూల్యాంకనం జరగలేదని, సిట్ దర్యాప్తుపై విమర్శలు



అమరావతి: ఏపీ సీఎం చంద్రబాబుపై మాజీ ముఖ్యమంత్రి జగన్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. డీఎస్సీ అక్రమాల నుంచి కుమారుడు నారా లోకేశ్‌ను కాపాడుకునేందుకే, ఏపీపీఎస్సీ గ్రూప్-1 పోస్టుల భర్తీపై మిగతా 2 లో



## ‘స్వాతంత్ర్య సమరయోధులను అవమానిస్తున్నారు’.. కాంగ్రెస్‌పై అమిత్ షా ఫైర్

1937 నిర్ణయం దేశ విభజనకు బీజం వేసిందన్న అమిత్ షా

ఆ నిర్ణయంతో ద్విజాతి సిద్ధాంతానికి బలం వచ్చిందని విమర్శ

బంకించంద్రుడి రచనను కాంగ్రెస్ అవమానిస్తోందని షా ఆరోపణ

## 22ఏ భూముల సమస్యకు

# ఫాస్ట్‌ట్రాక్ పరిష్కారం

### ప్రజలకు ఇబ్బందులు లేకుండా రిజిస్ట్రేషన్లు జరిగేలా చూడాలి

- ▸▸మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- ▸▸గతంలో రిజిస్ట్రేషన్లు, రికార్డుల్లో వివరాలను సమీక్షించిన తరువాతే నిర్ణయం తీసుకోవాలని స్పష్టం
- ▸▸ రిజిస్ట్రేషన్‌కు అవకాశం లేకపోతే దరఖాస్తుదారులకు స్పష్టంగా వెల్లడించాలి



హైదరాబాద్: నిషేధిత జాబితా 22ఏ లోని భూముల సమస్యలను ఫాస్ట్‌ట్రాక్ విధానంలో పరిష్కరిస్తున్నామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మిగతా 2 లో

# గ్రూప్-1పై విచారణకు మేము రెడీ.. డీఎస్సీపై సీబీఐ విచారణకు మీరు సిద్ధమా?

## చంద్రబాబుకు జగన్ సవాల్

మొదటి పేజి తరువాయి

ఏపీపీఎస్సీ గ్రూప్-1 పోస్టుల భర్తీపై చంద్రబాబు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని జగన్ ధ్వజమెత్తారు. గ్రూప్-1 వ్యవహారంపై సీబీఐ విచారణకు తాము సిద్ధంగా ఉన్నామని, డీఎస్సీ కుంభకోణంపై సీబీఐ విచారణకు చంద్రబాబు సిద్ధమా? అంటూ సవాల్ విసిరారు. డీఎస్సీపై దర్యాప్తు చేయాలని ఇప్పటికే కేంద్రాన్ని కోరినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. గ్రూప్-1 ఉద్యోగాల భర్తీ ప్రక్రియ గురించి వివరించారు. 2019 ఎన్నికలకు ముందు అప్పటి టీడీపీ ప్రభుత్వమే హడావిడిగా ఈ నోటిఫికేషన్ ఇచ్చిందని, తమ ప్రభుత్వం అధికారంలోకి రాకముందే మే 26న ప్రిలిమ్స్ పరీక్ష కూడా పూర్తయిందని గుర్తుచేశారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ప్రిలిమ్స్ ఫలితాలు ప్రకటించి, 2020 డిసెంబర్‌లో మెయిన్స్ నిర్వహించామని తెలిపారు. టీడీపీ హయాంలోనే జరిగిన పరీక్షలో ఎంపికైన వారికి ఇప్పుడు రాజకీయ రంగు పులమడం దారుణమని అన్నారు. కోవిడ్ కారణంగా మూల్యాంకనం ఆలస్యం కాకూడదనే ఉద్దేశంతో ఏపీపీఎస్సీ కమిషన్ డిజిటల్ మూల్యాంకనానికి నిర్ణయం తీసుకుందని, అయితే దీనిపై కొందరు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారని జగన్ వివరించారు. నోటిఫికేషన్‌లో పేర్కొననందున, హైకోర్టు ఆదేశాల మేరకు డిజిటల్ మూల్యాంకనాన్ని పూర్తిగా పక్కనపెట్టి, మాన్యువల్ పద్ధతిలోనే జవాబు పత్రాలను దిద్దామని స్పష్టం చేశారు. ఆ మార్కుల ఆధారంగానే 163 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలు ఇచ్చామని, ఈ ప్రక్రియ మొత్తం హైకోర్టు పర్యవేక్షణలోనే జరిగిందని తెలిపారు. ఇప్పుడు సంబంధం లేని డిజిటల్ మూల్యాంకనంపై ఆరోపణలు చేయడం కేవలం ఉద్యోగుల జీవితాలతో ఆడుకోవడమేనని విమర్శించారు. గ్రూప్-1 మూల్యాంకనం హాయ్‌ల్యాండ్‌లో జరిగిందంటూ చేస్తున్న ప్రచారాన్ని జగన్ తీవ్రంగా ఖండించారు. అక్కడ ఎలాంటి మూల్యాంకనం జరగలేదని, ఈ విషయాన్ని ప్రస్తుత కూటమి ప్రభుత్వం నియమించిన సిట్ కూడా హైకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో పేర్కొందని గుర్తుచేశారు. తమపై బురద జల్లేందుకు దర్యాప్తు బృందాలను వాడుకోవడం చంద్రబాబుకు అలవాటేనని ఆరోపించారు. నాలుగేళ్లుగా ఉద్యోగాలు చేస్తున్న వారిపై విషం కక్కుతూ, వారి భవిష్యత్తును నాశనం చేయాలని చూడటం సరికాదని జగన్ హితవు పలికారు. ఎన్ని అబద్ధాలు ప్రచారం చేసినా చివరకు నిజమే గెలుస్తుందని ఆయన అన్నారు.

### శాసనమండలిలో మంత్రి లోకేశ్ ప్రవేశపెట్టిన

# 5 బిల్లులకు ఏకగ్రీవ ఆమోదం

అమరావతి: ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో పలు కీలక బిల్లులకు ఆమోదం లభించింది. రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ 5 ముఖ్యమైన బిల్లులను సభలో ప్రవేశపెట్టగా, మండలి వాటిని ఏకగ్రీవంగా ఆమోదించింది. విద్యా, గ్రంథాలయ, నైపుణ్యాభివృద్ధి రంగాలలో సంస్కరణల లక్ష్యంగా ప్రభుత్వం ఈ బిల్లులను రూపొందించింది. నేడు జరిగిన శాసనమండలి సమావేశంలో మంత్రి లోకేశ్ ఈ బిల్లులను సభ ముందు ఉంచారు. మండలి ఆమోదించిన బిల్లులలో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ గ్రంథాలయాల సవరణ బిల్లు-2026, ఏపీ ఉన్నత విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ సవరణ బిల్లు ఉన్నాయి. వీటితో పాటు ఏపీ ప్రైవేటు విశ్వవిద్యాలయాల స్థాపన, క్రమబద్ధీకరణ సవరణ బిల్లు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యాసంస్థల (ఉపాధ్యాయుల కేడర్ లో రిజర్వేషన్) సవరణ బిల్లులను కూడా సభ ఆమోదించింది. రాష్ట్రంలో కొత్తగా ప్రైవేటు నైపుణ్య విశ్వవిద్యాలయాలను ఏర్పాటు చేసేందుకు ఉద్దేశించిన ఏపీ ప్రైవేటు నైపుణ్య విశ్వవిద్యాలయాల స్థాపన, క్రమబద్ధీకరణ బిల్లుకు కూడా మండలి ఆమోదముద్ర వేసింది. ఈ బిల్లులకు సభ్యులందరూ మద్దతు తెలపడంతో ఏకగ్రీవంగా ఆమోదం పొందినట్లు ప్రకటించారు.

# ప్రపంచంలోనే ఎత్తైన రైల్వే బ్రిడ్జిపై 100 కి.మీ వేగంతో వందే భారత్.. ఇదే తొలిసారి

ఢిల్లీ: ప్రపంచంలోనే ఎత్తైన రైల్వే వంతెనగా పేరున్న చీనాబ్ రైల్ బ్రిడ్జిపై తొలిసారిగా వందే భారత్ రైలు గంటకు 100 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించింది. కత్రా-బనిహాల్ రైలు మార్గంలో గరిష్ఠ వేగ పరిమితిని 100 కిలోమీటర్లకు పెంచేందుకు రైల్వే మంత్రిత్వ శాఖ అనుమతి ఇచ్చిన నేపథ్యంలో ఈ వేగంతో రైలు నడిచింది. జమ్మూ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఉచిత్ సింఘాల్ గురువారం ఈ విషయాన్ని వెల్లడించారు. వేగం పెరగడంతో ప్రయాణ సమయం తగ్గడంతో పాటు జమ్మూ-కశ్మీర్ మధ్య రైలు కనెక్టివిటీ మరింత మెరుగుపడుతుందని తెలిపారు. శ్రీ మాతా వైష్ణోదేవి కత్రా నుంచి బనిహాల్ వరకు ఉన్న 111 కిలోమీటర్ల కొత్త బ్రాడ్‌గేజ్ రైలు మార్గంలో రైళ్లను గరిష్ఠంగా గంటకు 100 కిలోమీటర్ల వేగంతో నడిపేందుకు అనుమతి లభించింది. ఇంతకుముందు కత్రా-సంగల్దాన్ మార్గంలో గరిష్ఠ వేగం 85 కిమీ, సంగల్దాన్-బనిహాల్ మార్గంలో 75 కి.మీగా ఉండేది. అన్ని నిర్దేశిత భద్రతా ప్రమాణాలను పరిశీలించిన తర్వాతే వేగాన్ని పెంచేందుకు అనుమతి ఇచ్చినట్లు నార్తర్న్ రైల్వే తెలిపింది. కొత్త వేగ పరిమితితో కత్రా నుంచి బనిహాల్ మధ్య ప్రయాణ సమయం మరింత తగ్గనుంది. దీంతో ప్రయాణికులకు వేగవంతమైన, సురక్షితమైన, సౌకర్యవంతమైన రైలు ప్రయాణం అందుబాటులోకి వస్తుందని రైల్వే అధికారులు తెలిపారు. రైలు కనెక్టివిటీ మెరుగుపడటంతో పర్యాటకం, వాణిజ్యం, స్థానిక ఆర్థిక కార్యకలాపాలకు కూడా ఊతం లభించే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. జమ్మూ-కశ్మీర్‌లోని చీనాబ్ రైల్ బ్రిడ్జి ప్రపంచంలోనే ఎత్తైన రైల్వే వంతెనగా గుర్తింపు పొందింది. ఇది చీనాబ్ నదీ మట్టానికి 359 మీటర్లు (1,178 అడుగులు) ఎత్తులో నిర్మించారు. ఈ వంతెన ఈఫిల్ టవర్ కంటే 35 మీటర్లు ఎత్తులో ఉండటం విశేషం. దీని పొడవు సుమారు 1,315 మీటర్లు. ఉక్కు, కాంక్రీట్‌తో నిర్మించిన ఈ ఆర్చ్ బ్రిడ్జి బలమైన గాలులు, భూకంపాలను తట్టుకునేలా రూపొందించారు.

### 'శుద్ధీకరణ' ఘటనపై ఖర్గే ఆవేదన..

# పార్టీ నేతల మౌనంపై అసంతృప్తి

ఢిల్లీ: ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో తన సభ జరిగిన ప్రదేశాన్ని శుద్ధి చేయడంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనను ఖండిస్తూ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ)లోని పలువురు నేతలు బహిరంగంగా స్పందించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేసినట్లు పార్టీ వర్గాలను ఉటంకిస్తూ ఎన్డీటీవీ వెల్లడించింది. ఆగస్టు 8న హల్ద్వానీలోని రామ్‌లీలా మైదానంలో ఖర్గే 'విజయ్ శంఖనాద' సభలో పాల్గొన్నారు. రెండు రోజుల తర్వాత ఆగస్టు 10న 'శ్రీరామ్ సేన'కు చెందిన కార్యకర్తలు అక్కడ శుద్ధి హోమం నిర్వహించారు. ఈ ఘటనపై కాంగ్రెస్ తీవ్రంగా స్పందించింది. ఢిల్లీలో బుధవారం జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలో ఖర్గే ఈ అంశాన్ని ప్రస్తావించినట్లు సమాచారం. ఘటన జరిగిన తర్వాత పలువురు సీడబ్ల్యూసీ సభ్యులు తనకు బహిరంగంగా మద్దతు ఇవ్వలేదని ఆయన బాధపడ్డారని పార్టీ వర్గాలు తెలిపాయి. అయితే ఖర్గే ఎవరినీ ప్రత్యేకంగా పేరుపెట్టి విమర్శించలేదని సమాచారం. కొందరు సీనియర్ నేతలు ఈ ఘటనపై గట్టిగా స్పందించకపోవడంపై ఆయన అసంతృప్తిగా ఉన్నట్లు సమావేశంలో వ్యవహరించిన తీరును బట్టి తెలుస్తోందని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. ఈ అంశాన్ని ఖర్గే గురువారం రాజ్యసభలో కూడా ప్రస్తావించారు. హల్ద్వానీలో తన సభ వేదికను శుద్ధి చేయడం తనను అవమానించినట్లుగా అనిపించిందని అన్నారు. "నన్ను రక్షించండి అని ఎవరినీ అడగలేదు. నాకు పోరాడే శక్తి ఉంది. పోరాడుతూనే ఉంటాను. కానీ హల్ద్వానీలో వేదికను శుద్ధి చేయడం వల్ల అంటరానితనం బాధను అనుభవించాను" అని ఖర్గే పేర్కొన్నారు. ఈ ఘటనకు బాధ్యులపై అంటరానితనం నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఖర్గే వ్యాఖ్యలపై రాజ్యసభలో కేంద్ర మంత్రి జేపీ నడ్డా స్పందించారు. హల్ద్వానీ ఘటన దురదృష్టకరమని అన్నారు. ఈ ఘటనలో బీజేపీ నేతలు, కార్యకర్తలకు సంబంధం లేదని స్పష్టం చేశారు. దీనిపై విచారణ జరుపుతామని హామీ ఇచ్చారు. మరోవైపు కాంగ్రెస్ మాత్రం శుద్ధీకరణ కార్యక్రమం నిర్వహించిన వారికి బీజేపీ, ఆర్ఎస్ఎస్‌తో సంబంధాలు ఉన్నాయని ఆరోపించింది. ఈ ఘటన వెనుక దళితుల పట్ల వివక్షతో కూడిన ఆలోచనా ధోరణి ఉందని విమర్శించింది. బీజేపీ మాత్రం ఆ కార్యక్రమానికి దూరంగా ఉంటూ శుద్ధీకరణ చర్యను ఖండించింది.

# రాహుల్ గాంధీకి హరీశ్ రావు లేఖ.. పొంగులేటిని మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్

హైదరాబాద్: తెలంగాణలోని రెవెన్యూ శాఖలో నిషేధిత భూముల (22ఏ) పేరుతో బహిరంగంగా దందాలు, వేధింపులు సాగుతున్నాయని ఆరోపిస్తూ కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు సంచలన బహిరంగ లేఖ రాశారు. ఈ అక్రమాలకు కేంద్ర బిందువుగా ఉన్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని తక్షణమే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని ఆయన గట్టిగా డిమాండ్ చేశారు. చట్టప్రకారం నిషేధిత భూముల రిజిస్ట్రేషన్లు అడ్డుకోవాల్సిన 22ఏ నిబంధనను, ప్రైవేట్ ఆస్తులపై కావాలనే కృత్రిమ వివాదాలు సృష్టించి డబ్బులు గుంజడానికి వాడుకుంటున్నారని హరీశ్ రావు మండిపడ్డారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ నుంచి ప్రారంభించి హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల్లో హెచ్ఎండీఏ (నవీణూ) అనుమతులు ఉన్న వేలాది ప్లాట్లు, నివాసాలను ఏకపక్షంగా నిషేధిత జాబితాలో చేర్చి సామాన్యులను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దశాబ్దాల క్రితమే క్రమబద్ధీకరించిన అర్బన్ ల్యాండ్ సీలింగ్ (ఖూజ) భూములను, క్లియర్ రిజిస్టర్డ్ పత్రాలు ఉన్న ఆస్తులను మళ్లీ నిషేధిత జాబితాలో చేర్చడం తీవ్ర దుర్మార్గమని విమర్శించారు. రెవెన్యూ శాఖలో ఏకంగా 30 శాతం కమీషన్ల రాకెట్ నడుస్తోందని హరీశ్ రావు ఆరోపించారు. ఒకసారి 22ఏ జాబితాలో పెట్టిన భూములను మళ్లీ తొలగించాలంటే మార్కెట్ విలువలో 30 శాతం కమీషన్లు ఇవ్వాలని దళారులు డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. ప్రత్యేకించి ఓఆర్ఆర్ పరిసరాల్లో ఉన్న అత్యంత విలువైన భూములను బ్లాక్ చేసి, రాజకీయ పలుకుబడి ఉన్న బినామీ సంస్థలతో 50:50 జాయింట్ డెవలప్‌మెంట్ అగ్రిమెంట్లకు ఒప్పుకోవాలని యజమానులపై ఒత్తిడి తెస్తున్నారని ధ్వజమెత్తారు. యాదాద్రి జిల్లాలో 40 వేల ఎకరాలను ఈ జాబితాలో పెట్టారని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్వయంగా బయటపెట్టినా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటివరకు స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి 22ఏ జాబితాలో కొత్తగా చేర్చిన, అలాగే తొలగించిన ప్రతి భూమి వివరాలపై హైకోర్టు మాజీ న్యాయమూర్తితో స్వతంత్ర విచారణ, ఫోరెన్సిక్ ఆడిట్ జరిపించాలని కోరారు. జిల్లాల వారీగా ఈ నిషేధిత భూముల జాబితాను పబ్లిక్ డొమైన్‌లో ఉంచి పారదర్శకత నిరూపించుకోవాలని సవాల్ విసిరారు. ఒక అవినీతి మంత్రిని కాపాడేందుకు ప్రజల నమ్మకాన్ని పణంగా పెడుతున్నారని, రాహుల్ గాంధీ వెంటనే స్పందించి చర్యలు తీసుకోకపోతే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

# దక్షిణాది రాష్ట్రాలు ఏకతాటిపైకి రావాలి.. మన మధ్య బలమైన సహకారం అవసరం

మొదటి పేజి తరువాయి

పరిరక్షణ కోసం అన్ని రాష్ట్రాలు సహకారంతో ముందుకు సాగాలని తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ పిలుపునిచ్చారు. చెన్నైలో 31వ సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ పలు కీలక అంశాలను ప్రస్తావించారు. దేశ జీడీపీలో 30 శాతానికి పైగా వాటా కలిగిన దక్షిణాది రాష్ట్రాలు తయారీ, ఎగుమతులు, సేవల రంగాల్లో కేంద్రంగా నిలుస్తున్నాయని ఆయన గుర్తుచేశారు.

ఆర్థిక కూటమిగా ఎదగాలి

తయారీ జోన్లు, లాజిస్టిక్స్ పార్కులు, ఫ్రైట్ కారిడార్ల ద్వారా దక్షిణ ప్రాంతం ఒక సమీకృత ఆర్థిక కూటమిగా పనిచేయాలని సీఎం విజయ్ ఆకాంక్షించారు. బెంగళూరులోని బొమ్మసంద్ర నుంచి హోసూర్ వరకు మెట్రో రైలు విస్తరణను స్వాగతించిన ఆయన, ఇది అంతర్రాష్ట్ర సహకారానికి ఒక నమూనా అని అభివర్ణించారు. ఈ పనులను వేగవంతం చేయాలని అధికారులను కోరారు. 'డ్రగ్స్ రహిత దక్షిణ భారతం' కోసం మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై నిఘా సమాచారాన్ని పంచుకుంటూ, కఠినంగా వ్యవహరించాలని సూచించారు. ఆన్‌లైన్‌లో మందుల విక్రయాలపై నియంత్రణ, అనధికార పంపిణీపై చర్యలు తీసుకోవాలని కోరారు.

### సముద్ర తీరంతో అభివృద్ధి

దక్షిణాది అభివృద్ధిలో బ్లూ ఎకానమీకి ప్రాధాన్యత ఇవ్వాలని విజయ్ అన్నారు. 1,076 కిలోమీటర్ల తీరప్రాంతం ఉన్న తమిళనాడు.. పోర్టులు, తీరప్రాంత నౌకాయానం, మత్స్య పరిశ్రమ, సముద్ర ఆధారిత పరిశ్రమలు, పర్యాటకం వంటి రంగాల్లో ఇతర రాష్ట్రాలతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉందని ప్రకటించారు. ఆర్థిక సమాఖ్య విధానంపై మాట్లాడుతూ.. రాబోయే ఫైనాన్స్ కమిషన్ నిధుల కేటాయింపులో రాష్ట్రాల అవసరాలు, పనితీరు రెండింటినీ పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టం చేశారు. జనాభా నియంత్రణలో విజయవంతమైన రాష్ట్రాలకు నష్టం జరగకూడదని, జీఎస్టీ తర్వాత పన్ను రేట్లను నిర్ణయించుకునే స్వేచ్ఛ రాష్ట్రాలకు ఉండాలని అన్నారు.

అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదాల్లో కోర్టు తీర్పులు, ట్రిబ్యునల్ అవార్డులను అమలు చేయడం ద్వారా దిగువ రాష్ట్రాల హక్కులను కాపాడాలని విజయ్ డిమాండ్ చేశారు. కావేరీ జలాల విషయంలో ఆదేశాలను సకాలంలో అమలు చేయాలని, ముల్లపెరియార్ డ్యామ్ భద్రత, నీటి నిల్వను 152 అడుగులకు పెంచే అంశం న్యాయస్థానాల నిర్ణయాల మేరకే జరగాలని స్పష్టం చేశారు. నీట్ పరీక్షపై తమిళనాడు వ్యతిరేకతను పునరుద్ఘాటించిన ఆయన.. ఇది గ్రామీణ, పేద విద్యార్థులకు నష్టం చేస్తుండటంతో రాష్ట్ర కోటాలోని మెడికల్, డెంటల్, ఆయుష్ సీట్లను 12వ తరగతి మార్కుల ఆధారంగా భర్తీ చేసేందుకు అనుమతించాలని కేంద్రాన్ని కోరారు. జనాభా నియంత్రణను విజయవంతంగా అమలు చేసిన కారణంగా డీలిమిటేషన్ ప్రక్రియలో ఏ రాష్ట్రం కూడా పార్లమెంటరీ ప్రాతినిధ్యాన్ని కోల్పోకుండా చట్టపరమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. "బలమైన రాష్ట్రాలతోనే దేశం బలోపేతమవుతుంది. విభేదాలను చర్చలు, పరస్పర గౌరవం, చట్ట పాలన ద్వారా పరిష్కరించుకోవడానికి తమిళనాడు సిద్ధంగా ఉంది" అని ఆయన చెప్పుకొచ్చారు.

# విభజన సమస్యల పరిష్కారానికి కేంద్రం చొరవ చూపాలి




అమరావతి: కేంద్ర హోంమంత్రి అమిత్ షా అధ్యక్షతన మహాబలిపురంలో జరిగిన 31వ సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు దక్షిణాది రాష్ట్రాల సమగ్రాభివృద్ధికి సంబంధించిన ఒక స్పష్టమైన బ్లూప్రింట్‌ను ఆవిష్కరించారు. సహకారం, సమన్వయంతోనే దక్షిణాది రాష్ట్రాలు ఆర్థికంగా పురోగమించగలవని ఆయన ఉద్ఘాటించారు. ఈ సమావేశంలో తమిళనాడు, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి ముఖ్యమంత్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. ఏపీ, కర్ణాటక, తమిళనాడును అనుసంధానిస్తూ కుప్పం మీదుగా బుల్లెట్ ట్రైన్ కారిడార్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. అమరావతి-బెంగళూరు-చెన్నై నగరాలను కలుపుతూ సమగ్ర రవాణా వ్యవస్థ, దక్షిణాది రాష్ట్రాల మధ్య ఉమ్మడి లాజిస్టిక్స్ నెట్‌వర్క్ అవసరమని సూచించారు. దేశ జీడీపీలో దాదాపు 31% వాటా ఉన్న దక్షిణాది రాష్ట్రాలు, 'వికసిత్ భారత్' నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలని, 2047 నాటికి 10 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగడమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. తిరుపతి నుంచి కాశీ, అయోధ్య, చార్‌ధామ్ వరకు ఆధ్యాత్మిక పర్యాటక సర్క్యూట్ ఏర్పాటు చేయాలని కూడా కోరారు.

గోదావరి-కావేరి అనుసంధానంపై కీలక సూచన

గోదావరి-కావేరి నదుల అనుసంధానంతో 500 టీఎంసీల నీటిని మళ్లించవచ్చని, తద్వారా తమిళనాడు తాగు, సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని చంద్రబాబు వివరించారు. ఈ విషయంలో ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలు సమన్వయంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. నదుల అనుసంధాన ప్రాజెక్టులకు కాలపరిమితితో కూడిన డీపీఆర్‌లు, అనుమతులు మంజూరు చేయాలని కేంద్రాన్ని కోరారు.

విభజన సమస్యల పరిష్కారానికి విజ్ఞప్తి

అదే సమయంలో ఆంధ్రప్రదేశ్ ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను కూడా ఆయన కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. 12 ఏళ్లుగా విభజన చట్టంలోని షెడ్యూల్ 9, 10 సంస్థల విభజన పూర్తికాలేదని, ఈ సమస్యల పరిష్కారానికి కేంద్రం వేగంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పోలవరం, సౌత్ కోస్ట్ రైల్వే జోన్, అమరావతి ప్రాజెక్టులకు కేంద్రం అందిస్తున్న సహకారాన్ని ప్రస్తావించారు. దుగరాజపట్నం పోర్టు, రిఫైనరీ, విశాఖ-విజయవాడ మెట్రో రైల్ ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు ఇవ్వాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగంపై ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రుల నుంచి ప్రశంసలు వెల్లువెత్తాయి. "సీనియర్ నాయకుడిగా చంద్రబాబు విశాల దృక్పథంతో అన్ని రాష్ట్రాల అభివృద్ధి గురించి మాట్లాడారు" అని కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కొనియాడారు.

# 'స్వాతంత్ర్య సమరయోధులను అవమానిస్తున్నారు'.. కాంగ్రెస్‌పై అమిత్ షా ఫైర్

ఢిల్లీ: వందేమాతరం విషయంలో కాంగ్రెస్ తీసుకున్న నిర్ణయం రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతోంది. పార్టీ కార్యక్రమాల్లో వందేమాతరం తొలి రెండు చరణాలనే పాడాలన్న నిర్ణయంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఇది సాధారణ నిర్ణయం కాదని.. స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరులను అవమానించడమేనని ఆరోపించారు. 1937లో కాంగ్రెస్ తీసుకున్న నిర్ణయాన్ని మళ్లీ అమలు చేయడం ద్వారా అప్పటి తప్పిదాన్ని పునరావృతం చేస్తోందని విమర్శించారు. "1937లో ముస్లిం ఓటు బ్యాంకు రాజకీయాల కోసం కాంగ్రెస్ వందేమాతరాన్ని రెండు భాగాలుగా చేసింది. అదే దేశ విభజనకు బీజం వేసింది. అక్కడి నుంచి ద్విజాతి సిద్ధాంతానికి బలం వచ్చింది. చివరకు దేశం విడిపోయి పాకిస్థాన్ ఏర్పడింది" అని షా ఆరోపించారు. ఇప్పుడు కాంగ్రెస్ మళ్లీ అదే నిర్ణయాన్ని అమలు చేస్తోందని అన్నారు. బంకించంద్ర చటర్జీ రచించిన వందేమాతరం దేశ స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించిందని షా పేర్కొన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం కాంగ్రెస్ బంకించంద్రుడి గొప్ప రచనను మాత్రమే కాదు.. "వందేమాతరం" అంటూ ఉరికంబాలు ఎక్కిన లక్షలాది మంది స్వాతంత్ర్య సమరయోధులను కూడా అవమానిస్తోందని విమర్శించారు. ఎన్నో ఏళ్లు జైళ్లలో గడిపిన వీరుల త్యాగాలను కూడా విస్మరిస్తోందని అన్నారు. వందేమాతరం రచనకు 150 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా కేంద్ర ప్రభుత్వం చారిత్రక తప్పిదాన్ని సరిదిద్దే ప్రయత్నం చేసిందని షా తెలిపారు. దేశ ఐక్యతను మరింత బలోపేతం చేసేందుకు పూర్తి వందేమాతరాన్ని ప్రభుత్వ కార్యక్రమాల్లో పాడేలా నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. దీనికి అధికారిక మార్గదర్శకాలు కూడా జారీ చేశామని వెల్లడించారు. రాహుల్ గాంధీ నాయకత్వంలోని కాంగ్రెస్ మాత్రం పార్లమెంట్ నిర్ణయాన్ని కాదని.. 1937 నాటి పార్టీ తీర్మానాన్ని అమలు చేస్తోందని షా విమర్శించారు. కాంగ్రెస్ మళ్లీ బుజ్జగింపు రాజకీయాలను ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. దేశ ప్రజలు ఈ నిర్ణయాన్ని ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్యం వచ్చిన 80 ఏళ్ల తర్వాత కూడా ఇలాంటి నిర్ణయాలను దేశ ప్రజలు సహించబోరని అన్నారు. కాగా, కాంగ్రెస్ మాత్రం తమ నిర్ణయాన్ని సమర్థించింది. 1937లో మహాత్మా గాంధీ, నెహ్రూ, రవీంద్రనాథ్ ఠాగూర్, సుభాష్ చంద్రబోస్, సర్దార్ పటేల్ తదితర అగ్రనేతలు ఉన్న సమయంలో తీసుకున్న నిర్ణయాన్నే ఇప్పుడు పాటిస్తున్నామని కేసీ వేణుగోపాల్ తెలిపారు. పార్టీ కార్యక్రమాల్లో తొలి రెండు చరణాలనే పాడతామని స్పష్టం చేశారు. వందేమాతరం, జాతీయ గీతం తమకు భావోద్వేగ అంశాలని.. బీజేపీ మాత్రం దీనిని రాజకీయ అంశంగా మార్చిందని విమర్శించారు.

## అక్టోబర్ 1 నుంచి ఎస్‌బీఐ కొత్త రూల్.. ఐదోసారి డబ్బు తీస్తే..!

ఢిల్లీ: ఎస్‌బీఐలో బేసిక్ సేవింగ్స్ ఖాతా ఉందా? అయితే అక్టోబర్ 1 నుంచి నగదు తీసుకునేటప్పుడు లెక్క చూసుకోవాల్సిందే. నెలలో నాలుగు సార్లు మాత్రమే ఉచితంగా నగదు తీసుకోవచ్చు. ఐదోసారి తీసుకుంటే రూ.15తో పాటు జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది. ఈ కొత్త నిబంధన సాధారణ సేవింగ్స్ ఖాతాలన్నింటికీ కాదు. ఎస్‌బీఐ 'బేసిక్ సేవింగ్స్ బ్యాంక్ డిపాజిట్' (బీఎస్‌బీడీ) ఖాతాదారులకు మాత్రమే వర్తిస్తుంది. నాలుగు ఉచిత నగదు ఉపసంహరణల్లో ఎస్‌బీఐ ఏటీఎంలు, ఇతర బ్యాంకుల ఏటీఎంలు, బ్యాంకు శాఖలు, ఏఈపీఎస్ ద్వారా తీసుకునే నగదు కూడా లెక్కలోకి వస్తుంది. మొత్తం నాలుగు సార్లు ఉచితంగా తీసుకున్న తర్వాత, అదే నెలలో మరోసారి నగదు తీసుకుంటే రూ.15తో పాటు జీఎస్టీ వసూలు చేస్తారు. కొత్త నిబంధనలు 2026 అక్టోబర్ 1 నుంచి అమల్లోకి వస్తాయని ఎస్‌బీఐ తెలిపింది. ఇప్పటివరకు నాలుగు ఉచిత లావాదేవీల లెక్కలో డిజిటల్ లావాదేవీలకు మినహాయింపు ఉండేది. తాజా మార్పుతో ఆ మినహాయింపును తొలగించారు. దీంతో బీఎస్‌బీడీ ఖాతాదారులు నెలవారీ లావాదేవీలపై మరింత జాగ్రత్తగా ఉండాల్సి ఉంటుంది. బీఎస్‌బీడీ ఖాతాకు కనీస నిల్వ నిబంధన లేదు. చెక్‌బుక్ సదుపాయం ఉండదు. రూపే ఏటీఎం-కమ్ డెబిట్ కార్డు ఉచితంగా ఇస్తారు. ఈ ఖాతా ఉన్నవారు ఎస్‌బీఐలో మరో సేవింగ్స్ ఖాతా కలిగి ఉండరాదని బ్యాంకు స్పష్టం చేసింది.

# తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ.. దర్శనానికి 18 గంటల సమయం

తిరుపతి: తిరుమల శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని కంపార్ట్‌మెంట్లన్నీ పూర్తిగా నిండిపోవడంతో, సర్వదర్శనం క్యూలైన్లు వెలుపల వరకు విస్తరించాయి. ప్రస్తుతం క్యూలైన్లు శిలాతోరణం వరకు చేరుకోవడంతో తిరుమల కొండపై భక్తుల రద్దీ ఏ స్థాయిలో ఉందో స్పష్టమవుతోంది. టోకెన్లు లేని సర్వదర్శనం భక్తులకు శ్రీవారి దర్శనం లభించేందుకు సుమారు 18 గంటల సమయం పడుతుందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు వెల్లడించారు. గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉంటున్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా టీటీడీ యంత్రాంగం పటిష్ఠ ఏర్పాట్లు చేస్తోంది. భక్తులకు తాగునీరు, అల్పాహారం వంటి సౌకర్యాలను సిబ్బంది నిరంతరం పంపిణీ చేస్తున్నారు. మరోవైపు, నిన్న (బుధవారం) శ్రీవారిని మొత్తం 76,464 మంది భక్తులు దర్శించుకున్నారు. వీరిలో 36,913 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. ఒక్కరోజే శ్రీవారి హుండీ ద్వారా రూ. 4.94 కోట్ల ఆదాయం సమకూరినట్లు టీటీడీ అధికారులు తెలిపారు. వారాంతం సమీపిస్తుండటంతో భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

## 22ఏ భూముల సమస్యకు ఫాస్ట్‌ట్రాక్ పరిష్కారం

హైదరాబాద్: నిషేధిత జాబితా 22ఏ లోని భూముల సమస్యలను ఫాస్ట్‌ట్రాక్ విధానంలో పరిష్కరిస్తున్నామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ మేరకు మంత్రి కార్యాలయం వివరాలను వెల్లడించింది. ఖమ్మం జిల్లా పర్యటనలో ఉన్న మంత్రి అధికారులతో టెలికాన్ఫరెన్సు నిర్వహించారు. రెవెన్యూశాఖ కార్యదర్శి లోకేశ్‌కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ కమిషనర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లను ఫోన్లో సంప్రదించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా రిజిస్ట్రేషన్లు జరిగేలా చూడాలని మంత్రి ఆదేశించారు. 22ఏ జాబితాలో చిక్కుకున్న ప్రైవేటు భూములకు సంబంధించి.. ప్రస్తుత వాస్తవ పరిస్థితి, హక్కుదారుల వద్ద ఉన్న పత్రాలు, గతంలో రిజిస్ట్రేషన్లు, రికార్డుల్లో వివరాలను సమీక్షించిన తరువాతే నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేశారు. రిజిస్ట్రేషన్‌కు అవకాశం లేకపోతే దరఖాస్తుదారులకు స్పష్టంగా వెల్లడించాలని మంత్రి ఆదేశించినట్లు తెలిసింది. మరోవైపు.. సమస్య పరిష్కారమైన చోట సబ్‌రిజిస్ట్రార్లు ప్రజలకు ఫోన్ ద్వారా సమాచారమిస్తూ.. వచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచిస్తున్నారు.

### బాలానగర్ పరిధిలో...

'బాలానగర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలోని సర్వే నంబర్లు 101/1, 101/2, 102, 108, 109, 112, 81లో 3 వేల చ.మీ. స్థలంపై 22ఏ నిషేధం తొలగిపోయింది. ఈ సర్వే నంబర్లలోని భూములకు రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చు' అని బాలానగర్ సబ్‌రిజిస్ట్రార్ వెల్లడించారు.

### పోచారం గ్రామంలోని సర్వే నం.50లో...

'పోచారం గ్రామంలోని సర్వే నం.50ను ఏపీ హౌసింగ్ బోర్డు భూమిగా పేర్కొంటూ గతేడాది డిసెంబరులో 22ఏలో చేర్చడంతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. ఇటీవల కలెక్టర్ నుంచి క్లియరెన్సు రావడంతో రిజిస్ట్రేషన్లు చేస్తున్నాం' అని నారపల్లి సబ్‌రిజిస్ట్రార్ సునీల్ తెలిపారు.

### కూకట్‌పల్లి అడ్డగుట్ట సొసైటీలో..

తమ సొసైటీలోని 300 ప్లాట్లను నిషేధిత జాబితా నుంచి తొలగించిట్లు అధికారులు వెల్లడించారని కూకట్‌పల్లి అడ్డగుట్ట సొసైటీ చక్రపాణి తెలిపారు. "సొసైటీలోని నంబరు 80సీలోని 250 గజాల స్థలాన్ని నెలరోజుల క్రితం కొనుగోలు చేశా. రిజిస్ట్రేషన్‌కు వెళ్తే 22ఏలో ఉందని తిరస్కరించారు. ఇప్పుడు దానికి ప్రభుత్వం పరిష్కారం చూపడంతో... మంగళవారం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి ఫోన్ వచ్చింది. బుధవారం రిజిస్ట్రేషన్ పూర్తయింది' అని వివరించారు.

# 'ఇందిరమ్మ' రెండో విడతకు వేగంగా కసరత్తు

మొదటి పేజి తరువాయి

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే 2.50 లక్షల ఇళ్లను పేదలకు పంపిణీ చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. క్యూర్ పరిధి మినహాయించి రాష్ట్రంలోని 100 నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 2,500 చొప్పున ఇళ్లను నిర్మించి ఇవ్వనుంది. రాష్ట్రవ్యాప్తంగా 50 వేల మంది వరకు గుడిసెల్లో నివసిస్తున్నట్లు అధికారుల సర్వేలో తేలింది. రెండో విడతలో వీరందరికీ మొదటి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. అలాగే, 'రూఫ్ పునఃప్రారంభం' అనే కొత్త పథకం పేరుతో నియోజకవర్గానికి 700 చొప్పున 70 వేల ఇళ్లు మంజూరు చేయనున్నారు. తుది జాబితాను కలెక్టర్ పరిశీలించిన తర్వాత దస్త్రం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వద్దకు వెళ్తుంది. మంత్రి ఆమోదించాక లబ్ధిదారుల పేర్లను అధికారికంగా ప్రకటిస్తారు. ఈ ప్రక్రియ అంతా సెప్టెంబరు 15 నాటికి పూర్తయ్యేలాకసరత్తు చేస్తున్నారు. ప్రభుత్వం రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల కోసం రూ.10,400 కోట్లను కేటాయించింది. ఇందులో 1.80 లక్షల ఇళ్లకు ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున రూ.9 వేల కోట్లను, రూఫ్ ఆధునికీకరణలో భాగంగా 70 వేల ఇళ్లకు రూ.2 లక్షల చొప్పున రూ.1,400 కోట్లను అందించనుంది.

మహిళా సంఘాల ద్వారా రూ.లక్ష

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో భాగంగా లబ్ధిదారులకు ప్రభుత్వం రూ.5 లక్షలను నాలుగు దశలో ఇవ్వనుంది. పునాది దశ దాటిన తర్వాత మొదటి విడత రూ.లక్షను అందిస్తారు. అయితే ఇందిరమ్మ ఇళ్ల మొదటి విడతలో భాగంగా చాలామంది పేదలు పునాది వరకు ఇళ్లను నిర్మించుకోవడంలో ఆర్థికంగా ఇబ్బంది పడ్డారు. ఈసారి ఆ పరిస్థితి తలెత్తకుండా మహిళా సంఘాల ద్వారా లబ్ధిదారులకు రూ.లక్ష రుణం ముందే ఇచ్చేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పునాది దశ దాటిన తర్వాత ప్రభుత్వం నుంచి జమయ్యే రూ.లక్షను లబ్ధిదారులు మహిళా సంఘానికి తిరిగి చెల్లించాల్సి ఉంటుంది.

### విద్యాహక్కు చట్టం కింద లక్ష దాటిన ప్రవేశాలు..

# ప్రజా ప్రభుత్వ ఘనతన్న మంత్రి లోకేశ్



అమరావతి: రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యాహక్కు చట్టం (ఆర్టీఈ) అమలులో గణనీయమైన పురోగతి సాధించామని, ప్రైవేట్ అన్ఎయిడెడ్ పాఠశాలల్లో పేద విద్యార్థుల ప్రవేశాలు భారీగా పెరిగాయని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. నేడు శాసనమండలిలో ఆర్టీఈ ప్రవేశాలపై సభ్యులు కావలి గ్రీష్మ, భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, పేరాబత్తుల రాజశేఖర్ అడిగిన ప్రశ్నకు ఆయన బదులిచ్చారు. తమ ప్రభుత్వ చిత్తశుద్ధికి ఈ గణాంకాలే నిదర్శనమని పేర్కొన్నారు. మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. "విద్యాహక్కు చట్టం సెక్షన్ 12(1)(సి) కింద ప్రైవేట్ పాఠశాలల్లో బలహీన వర్గాల విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించే ప్రక్రియను ప్రజాప్రభుత్వం పటిష్ఠంగా అమలు చేస్తోంది. దీని ఫలితంగా 2022-23 నుంచి 2026-27 విద్యా సంవత్సరం వరకు మొత్తం 1,04,046 మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల్లో ప్రవేశాలు పొందారు. పూర్తి పారదర్శకత కోసం అడ్మిషన్ల ప్రక్రియను ఆన్‌లైన్ ద్వారా నిర్వహిస్తున్నాం" అని వివరించారు. గత ప్రభుత్వ హయాంతో పోలిస్తే ప్రవేశాల సంఖ్యలో భారీ వ్యత్యాసం కనిపిస్తోందని లోకేశ్ గణాంకాలతో సహా వివరించారు. "2022-23 విద్యా సంవత్సరంలో కేవలం 2,203 మంది విద్యార్థులు మాత్రమే ఆర్టీఈ కింద ప్రవేశాలు పొందారు. కానీ, ప్రజాప్రభుత్వం వచ్చిన మొదటి ఏడాదే, అంటే 2024-25లో, ఈ సంఖ్య ఏకంగా 29,000కు పెరిగింది. అదేవిధంగా, 2026-27లో 28,742 మంది విద్యార్థులకు ప్రైవేట్ స్కూళ్లలో సీట్లు లభించాయి. ఇది మా ప్రభుత్వ పనితీరుకు నిదర్శనం" అని అన్నారు. విద్యాహక్కు చట్టంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రభుత్వం విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు చేపట్టిందని, దాని ఫలితంగానే అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు పెరిగాయని మంత్రి తెలిపారు. సమాజంలోని ప్రతి పేద విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా ఆర్టీఈ చట్టాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

వార్త
జాతీయ తెలుగు దినపత్రిక


# వినాయక చవితి, తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు

తిరుపతి పట్టణంలో వినాయక చవితి నిమజ్జనంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా చూడాలి

శ్రీవారి బ్రహ్మోత్సవాల దృష్ట్యా వినాయక విగ్రహాల నిమజ్జనం సెప్టెంబర్ 20 లోపు పూర్తి కావాలి

నిమజ్జన ఘాట్ల వద్ద భద్రత, విద్యుత్, వైద్య, పారిశుధ్య సదుపాయాలు కల్పించాలి

జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్

పోలీస్ బందోబస్తు, ట్రాఫిక్, ప్రజా భద్రతపై ప్రత్యేక దృష్టి

:జిల్లా ఎస్. పి ఎల్. సుబ్బారాయుడు




తిరుపతి, ఆగస్ట్ 20 : వినాయక చవితి, తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు ఒకే సమయంలో జరుగుతున్న నేపథ్యంలో రెండు ప్రధాన కార్యక్రమాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు ప్రణాళిక రూపొందించి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు వినాయక చవితి ఉత్సవాల నిర్వహణ, నిమజ్జనం పై జిల్లా ఎస్పి ఎల్. సుబ్బారాయుడు, జాయింట్ కలెక్టర్ ఆర్. గోవింద రావు, తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ ఎం.జయకృష్ణ లతో కలసి జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఏడాది వినాయక చవితి కార్యక్రమాలు సెప్టెంబర్ 14వ తేదీ నుంచి ప్రారంభం కానుండగా, తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు సెప్టెంబర్ 15 నుంచి 23వ తేదీ వరకు జరగనున్నాయని, అదే సమయంలో గౌరవ ముఖ్యమంత్రి సెప్టెంబర్ 15వ తేదీ సాయంత్రం తిరుపతికి రానున్న నేపథ్యంలో భద్రత, ట్రాఫిక్, ప్రజల రాకపోకలు, పోలీసు బందోబస్తు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో అత్యంత ప్రాధాన్యత కలిగిన గరుడ సేవ రోజున భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉన్నందున, ఆ రోజుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి. వినాయక నిమజ్జన కార్యక్రమాల సమయాలు, శోభాయాత్ర మార్గాలు, భక్తుల రాకపోకలు, ట్రాఫిక్ మళ్లింపులు తదితర అంశాలను ముందుగానే సమన్వయం చేసుకోవాలని సూచించారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల దృష్ట్యా తిరుపతి పట్టణంలో వినాయక నిమజ్జనం కార్యక్రమం 1, 3, 7వ రోజులైన సెప్టెంబర్ 14, 16, 20వ తేదీలలో లోపు పూర్తి చేసుకోవాలని ప్రజలను కోరారు. ప్రధాన నిమజ్జన కార్యక్రమం వినాయక సాగర్ వద్ద నిర్వహించడంతో పాటు, దామినేడు, తూకివాకం, చెన్నయ్యగుంట చెరువులను ప్రత్యామ్నాయ నిమజ్జన ప్రాంతాలుగా గుర్తించి అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. వినాయక చవితి కార్యక్రమాల నిర్వహణలో మున్సిపల్ శాఖ కీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని, కొత్తగా బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ కమిషనర్ మొత్తం కార్యక్రమాలపై సమగ్ర పర్యవేక్షణ, సమన్వయం చేపట్టాలని సూచించారు. నిమజ్జన ఘాట్లు, శోభాయాత్ర మార్గాలు, పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్, లైటింగ్, ట్రాఫిక్, తాత్కాలిక సదుపాయాలు, ప్రజా భద్రత తదితర అంశాలపై సంబంధిత శాఖలతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని తెలిపారు. నిమజ్జన ఘాట్ల వద్ద లైటింగ్, క్రేన్లు, బారికేడింగ్, ఈతగాళ్లు, బోట్లు, లైఫ్ జాకెట్లు తదితర భద్రతా ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలన్నారు. ముఖ్యంగా చెరువుల వద్ద ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి ప్రజలు నీటిలోకి వెళ్లకుండా తగిన బారికేడింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఎన్‌డీఆర్ఎఫ్/ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలతో పాటు స్థానిక శిక్షణ పొందిన ఈతగాళ్లను కూడా అందుబాటులో ఉంచాలన్నారు. నిమజ్జన శోభాయాత్ర మార్గాలు, నిమజ్జన ఘాట్ల వద్ద నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ వైర్లు, కేబుళ్లు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ప్రజలకు ప్రమాదం జరగకుండా బారికేడింగ్ ఏర్పాటు చేయడంతో పాటు, అత్యవసర పరిస్థితుల్లో వినియోగించేందుకు జనరేటర్లను సిద్ధంగా ఉంచాలి. మున్సిపల్, పంచాయతీ అధికారులు నిమజ్జన శోభాయాత్ర మార్గాల్లో రోడ్ల పరిశుభ్రత, చెత్త తొలగింపు, తాగునీటి సరఫరా వంటి ఏర్పాట్లు చేపట్టాలన్నారు. శోభాయాత్రలకు ఆటంకం కలిగించే చెట్ల కొమ్మలను ముందుగానే ట్రిమ్మింగ్ చేయాలని సూచించారు. నిమజ్జన ప్రాంతాల్లో పారిశుధ్య చర్యలను నిరంతరం చేపట్టి అవసరమైన చోట్ల బ్లీచింగ్ పౌడర్ చల్లాలన్నారు. మహిళల సౌకర్యార్థం నిమజ్జన ఘాట్ల వద్ద తాత్కాలిక చేంజింగ్ రూమ్‌లు ఏర్పాటు చేయాలి. భక్తులు, నిర్వాహకులు, స్వచ్ఛంద కార్యకర్తలకు అవసరమైన కనీస సదుపాయాలను కల్పించాలన్నారు. అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో నిమజ్జన ప్రాంతాల వద్ద ఫైర్ ఇంజన్లను సిద్ధంగా ఉంచాలన్నారు. బాణసంచా వినియోగించే ప్రాంతాల్లో ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టి, అగ్ని ప్రమాదాలకు అవకాశం లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా ఫైర్ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ బృందాలను అప్రమత్తంగా ఉంచాలన్నారు. నిమజ్జన ప్రాంతాలు, ప్రధాన శోభాయాత్ర మార్గాల్లో వైద్య శిబిరాలు, అంబులెన్సులు, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. అత్యవసర వైద్య సేవలు అవసరమైనప్పుడు సమీప ఆసుపత్రులకు వేగంగా తరలించేలా ముందస్తు ప్రణాళిక రూపొందించాలన్నారు. శోభాయాత్ర మార్గాల్లో టీటీడీ తరఫున ప్రసాదం, ఆధ్యాత్మిక పుస్తకాల పంపిణీ, లైవ్ టెలికాస్ట్ వంటి ఏర్పాట్లను పరిశీలించాలన్నారు. కార్యక్రమ నిర్వహణలో ఎన్‌సీసీ, సేవా స్వచ్ఛంద కార్యకర్తల సేవలను వినియోగించుకుని జన సమూహాల నియంత్రణ, మార్గనిర్దేశం, అత్యవసర సహాయక చర్యల్లో వారి సహకారం తీసుకోవాలన్నారు. వినాయక నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించే కమిటీ నిర్వాహకులు నిమజ్జనం తేదీ, శోభాయాత్ర వివరాలు, నిర్వాహకుల పూర్తి వివరాలతో సంబంధిత పోలీస్/ఆర్డీఓ కార్యాలయాల్లో దరఖాస్తులు సమర్పించి ముందస్తు అనుమతులు పొందాలన్నారు. నిమజ్జన కార్యక్రమాలను ప్రభుత్వ మార్గదర్శకాలు, పోలీసు శాఖ సూచనలకు అనుగుణంగా నిర్వహించాలన్నారు. అలాగే ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రాత్రి 10 గంటల తర్వాత మైక్ సిస్టమ్‌ల వినియోగంపై నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలన్నారు. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ, వినాయక నిమజ్జన కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో, పూర్తి భద్రతతో జరిగేలా చర్యలు చేపట్టాలని అధికారులు ఆదేశించారు. జిల్లా ఎస్ పి మాట్లాడుతూ వినాయక విగ్రహాల శోభాయాత్రలకు సంబంధించి ముందుగానే రూట్ మ్యాప్ సిద్ధం చేసి, ట్రాఫిక్ మళ్లింపులు, పార్కింగ్, జన సమూహాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. నిమజ్జన విగ్రహాలను తరలించే వాహనాల డ్రైవర్లకు తప్పనిసరిగా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించాలని, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. భారీ వాహనాలు మార్గమధ్యంలో నిలిచిపోయిన సందర్భాల్లో వెంటనే తొలగించేందుకు టోయింగ్ వాహనాలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. వినాయక సాగర్‌తో పాటు ఇతర నిమజ్జన ప్రాంతాల్లో సీసీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా ఏర్పాటు చేసి, కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా పరిస్థితులను పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఆర్డీఓ రామ్మోహన్, అడిషనల్ ఎస్పి లు రవి మనోహరాచారి, శ్రీనివాస రావు, కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్, కమిటీ సభ్యులు, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




## వ్యవసాయ రంగంలో కృత్రిమ మేధస్సు పెంపొందించాలి

వ్యవసాయ విశ్వవిద్యాలయ విస్తరణ విభాగాధిపతి డా. జి. శివనారాయణ పిలుపు



బాపట్ల జిల్లా ఆగస్టు 20 : రైతులు ఆధునిక వ్యవసాయ విధానాలను చేపట్టి కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆంగ్రూ వ్యవసాయ విశ్వ విద్యాలయ విస్తరణ విభాగాధిపతి, సీనియర్ ప్రొఫెసర్ డా . జి . శి వ నా రా య ు ణ సూచించారు. వ్యవసాయ కళాశాలలో విస్తరణ విభాగం ఆధ్వర్యంలో కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఏఐ ఆధారిత సాంకేతిక పరిజ్ఞానం వ్యవసాయంలో నిర్ణయాలు తీసుకునే ప్రక్రియను మరింత వేగవంతం చేయగలదని, విద్యార్థులు ఏఐపై అవగాహన పెంచుకుని భవిష్యత్లో రైతులకు ఉపయోగపడే సాంకేతిక పరిష్కారాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని తెలిపారు. మోహన్ కాటమనేని సహ వ్యవస్థాపకుడుగా రూపొందించబడిన భూమిఏఐ.ఇన్ యాప్ ను రైతులకు చేరేందుకు విద్యార్థులు కృషి చేయాలన్నారు. ఈ యాప్ ద్వారా రైతులకు వివిధ సేవలు అందుబాటులోకి వస్తాయని, దేశవ్యాప్తంగా మార్కెట్లలో ప్రత్యక్ష మండి ధరలు, వాతావరణ సమాచారం, పంటల్లో చీడ పీడల గుర్తింపు, నేల ఆరోగ్య సమాచారం, ప్రభుత్వ పథకాలు, సబ్సిడీ వివరాలను సులభంగా రైతులు తెలుసుకోవచ్చన్నారు. ముఖ్య అతిధిగా పాల్గొన్న మోహన్ కాటమనేని భూమిఏఐ.ఇన్ యాప్ ద్వారా రైతులు పంటకు సంబంధించిన సమస్యలను ఫొటో ద్వారా గుర్తించి తగిన పరిష్కారాలను పొందే అవకాశం ఉందన్నారు. అధికారిక వ్యవసాయ, వాతావరణ సమాచార వనరులను అనుసంధానం చేసి రైతులకు ఒకే వేదికపై అవసరమైన సమాచారాన్ని అందించడమే 'భూమి ఏఐ' ప్రధాన ఉద్దేశమన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో ప్రొఫెసర్ డా. మండవ శ్రీనివాసరావు, టీచింగ్ అసోసియేట్లు డా. ఎం. ఉదయ్ భాస్కర్, డాక్టర్. డి. నవీన్, పీజీ, పీహెచ్డీ విద్యార్థులు, అగ్రికల్చరల్ జర్నలిజం విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు ఏఐ ఆధారిత వ్యవసాయ పరిజ్ఞానంపై పలు ప్రశ్నలు అడిగి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

## వ్యవసాయ కళాశాలలో రాష్ట్ర కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలపై అవగాహన సదస్సు



బాపట్ల ఆగస్టు 20 : రాష్ట్రంలో ఏటా సుమారు లక్ష వరకు ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయని, వ్యవసాయ విద్యార్థులు ముందస్తు ప్రణాళికతో ఇప్పటినుంచే సిద్ధం కావాలని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డా.పి.ప్రసూన రాణి అన్నారు. నైపుణ్య, కళాశాలలో ఉపాధి మరియు శిక్షణ శాఖ ఆధ్వర్యంలో కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగావకాశాలపై నిర్వహించబడిన ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ సమయపాలన, క్రమశిక్షణ, ఒత్తిడి నిర్వహణ ప్రధాన అంశాలుగా విద్యార్థులు భావించాలని, కళాశాల పూర్వ విద్యార్థులైన కాంతి లాల్ దండే, ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు తదితర ఉన్నత వ్యక్తులను ఆదర్శంగా తీసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఉద్బోధించారు. ఈ సదస్సులో పాల్గొన్న కళాశాల ప్రొఫెసర్లు డా. కె. సుశీల, డా. లాల్ అహ్మద్ మహమ్మద్, డా.ఎస్. హైమజ్యోతి, అసిస్టెంట్ ప్రొఫెసర్ బి. అపర్ణ, జిల్లా ఉపాధి అధికారి రాజారావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి మాధవి, కేంద్ర విద్యా సంస్థల ఛైర్మన్ ఆవల వెంకటేశ్వర్లు విద్యార్థులు డిజిటల్ యాప్ లను సాంకేతికతను పరీక్షల ప్రిపరేషన్, ఉద్యోగ సమాచారం కోసం సానుకూల మార్గంలో వినియోగించుకోవాలని సూచించారు. నైపుణ్య మరియు ఉపాధి శాఖ వద్ద తమ పేర్లను నమోదు చేసుకోవడంపై అభ్యర్థులకు స్పష్టమైన అవగాహన కల్పించారు. రైల్వే తదితర కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో భారీగా ఖాళీలు ఉన్నాయని, ఆయా అవకాశాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ బీఎస్సీ చివరి సంవత్సరం విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీశైలంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



శ్రీశైలం, ఆగస్టు 20 : శ్రావణ మాస శోభతో సింగారించుకున్న ప్రముఖ శైవక్షేత్రం శ్రీశైలంలో ధార్మిక వైభవం ఉప్పొంగుతోంది. భక్తులలో సనాతన ధర్మంపై అవగాహన కల్పించి, వారిలో ధార్మిక చింతనను, భక్తిభావాన్ని మరింత పెంపొందించే లక్ష్యంతో శ్రీశైల దేవస్థానం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలకు సర్వం సిద్ధమైంది. ఈ మేరకు శ్రీశైల దేవస్థానం కార్యనిర్వహణాధికారి కార్యాలయం నుండి గురువారం ఆలయ ఈవో యం శ్రీనివాసరావు, ఛైర్మన్ రమేష్ నాయుడు, మాట్లాడుతూ , శుక్రవారం (ఆగస్టు 21) జరుగనున్న ఈ సామూహిక వరలక్ష్మీ వ్రతాలలో మొత్తం 1,500 మంది ముత్తైదువులు పాలుపంచుకునేలా ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆన్‌లైన్ మ్యానువల్ పద్ధతిలో టోకెన్ల కేటాయింపు భక్తుల రద్దడిని దృష్టిలో ఉంచుకుని పారదర్శకంగా ఈ వ్రతాల్లో పాల్గొనేందుకు అవకాశం కల్పించారు. ఇందులో భాగంగా మొత్తం 1,500 మందికి వసతి కల్పించగా, అందులో 500 టోకెన్లను ఆన్‌లైన్ ద్వారా అందుబాటులో ఉంచారు. మిగిలిన టోకెన్లను దేవస్థానం ప్రజాసంబంధాల విభాగం ద్వారా నేరుగా భక్తులకు అందజేశారు. శ్రీశైల మహాక్షేత్రంలోని ఆలయ ఉత్తరద్వారం ఎదురుగా ఉన్న సువిశాలమైన చంద్రవతి కల్యాణమండపంలో ఈ పవిత్ర వ్రతాలు కనులపండువగా జరగనున్నాయి. ప్రత్యేక తేదీలలో శివసేవకులు చెంచు ముత్తైదువులకు పెద్దపీట ఈ ఏడాది శ్రావణ మాసంలో భక్తులందరికీ సముచిత స్థానం కల్పించాలనే ఉద్దేశంతో దేవస్థానం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. రేపటి తొలి విడత వ్రతాలతో పాటు, శ్రావణ మూడవ శుక్రవారం (ఆగస్టు 28) నాల్గవ శుక్రవారం (సెప్టెంబర్ 4) రోజులలో కూడా ఈ సామూహిక వ్రతాలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు. ముఖ్యంగా, నిత్యం భక్తులకు నిస్వార్థంగా సేవనందిస్తున్న శివసేవకుల సౌకర్యార్థం ఈసారి మూడవ శుక్రవారం నాడు ప్రత్యేకంగా వారికోసమే వ్రతాలను నిర్వహిస్తున్నారు. అలాగే నాల్గవ శుక్రవారం రోజున సుమారు 750 మందికి పైగా స్థానిక చెంచు ముత్తైదువులకు, మరో 750 మంది ఇతర భక్తులకు ఈ అదృష్టాన్ని కల్పించడం విశేషం. పూర్తిగా ఉచితం – దేవస్థానం తరఫున సర్వసమకూర్పు ధర్మప్రచార యజ్ఞంలో భాగంగా చేపట్టిన ఈ ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతంలో పాల్గొనే ప్రతి ముత్తైదువకు దేవస్థానమే స్వయంగా పూజాద్రవ్యాలన్నింటినీ సమకూరుస్తోంది. ఎలాంటి ఆర్థిక భారం లేకుండా మహిళలు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని పూజించుకునేలా ప్రతి ముత్తైదువ కోసం వేర్వేరుగా ప్రత్యేక కలశాలను నెలకొల్పి వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా ఈ వ్రతం జరిపించడం జరుగుతుంది. వ్రత మహోత్సవం ముగిసిన తరువాత పాల్గొన్న ముత్తైదువులందరికీ అమ్మవారి దివ్య శేషవస్త్రాలుగా పట్టుచీర, రవిక వస్త్రం, పూలు, గాజులు అందజేయనున్నారు. వీటితో పాటు నోరూరించే లడ్డు ప్రసాదం, పుస్తక ప్రసాదంగా శ్రీశైల క్షేత్ర విశేషాలు తెలిపే 'శ్రీశైలప్రభ' మాసపత్రికను, పర్యావరణ హితంగా వృక్ష ప్రసాదంగా తులసి, ఉసిరి మొదలైన పవిత్ర దేవతా మొక్కలను బహుకరించనున్నారు. అంతేకాకుండా, వ్రతానంతరం ముత్తైదువులందరూ ఆనందంగా ధరించేందుకు వీలుగా శ్రీస్వామిఅమ్మవార్ల పవిత్ర కైలాస కంకణాలను కూడా అందజేయనున్నట్లు ఈవో తెలిపారు. ఈ ధార్మిక కార్యక్రమాల విశిష్టతను ధర్మకర్తల మండలి అధ్యక్షులు పోతుగుంట రమేష్‌నాయుడు కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ.. అష్టైశ్వర్యాలను ప్రసాదించే వరలక్ష్మీ వ్రతంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని పిలుపునిచ్చారు.

## 3 కొత్త పీహెచ్‌సీలు మంజూరు చేయండి

"పీహెచ్‌సీలే అత్యవసర ప్రాణరక్షక కేంద్రాలు"

అసెంబ్లీ సాక్షిగా ఎమ్మెల్యే ఏలూరి గళం

వలపర్ల, పెద్దగంజాం, మోటుపల్లిలలో నూతన పీహెచ్‌సీల ఏర్పాటుకు విజ్ఞప్తి

మంత్రికి గతంలోనే లేఖ ద్వారా విన్నపం...

తాజాగా సభలో మరోమారు కోరిన ఎమ్మెల్యే

రాష్ట్ర వ్యాప్తంగా 140కి పైగా కేంద్రాల ఆవశ్యకత... శిథిలావస్థలో పాత భవనాలు

ఉన్న పీహెచ్‌సీలకూ మెరుగైన పరికరాలు, వైటల్స్ కల్పించండి



బాపట్ల జిల్లా పర్చూరు ఆగస్టు 20 : గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు క్షణాల్లో చికిత్స అందించే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలే (పీహెచ్‌సీలు) నిజమైన అత్యవసర ప్రాణరక్షక వ్యవస్థలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అసెంబ్లీలో అభిప్రాయపడ్డారు. సకాలంలో ప్రథమ చికిత్స అందితేనే ఎన్నో అమూల్యమైన ప్రాణాలను కాపాడుకోగలమని, అందుకు గ్రామస్థాయిలో పీహెచ్‌సీల లభ్యత అత్యంత కీలకమని ఆయన సభ దృష్టికి తీసుకెళ్లారు. గురువారం అసెంబ్లీలో ఆయన ప్రసంగించారు. నియోజకవర్గంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు చేరువ చేయాలన్న లక్ష్యంతో వలపర్ల, పెద్దగంజాం, మోటుపల్లి గ్రామాల్లో కొత్తగా మూడు పీహెచ్‌సీలు మంజూరు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ అంశంపై గతంలోనే వైద్య ఆరోగ్య శాఖ మంత్రికి లేఖ రాసినట్లు గుర్తుచేస్తూ, తాజాగా అసెంబ్లీ వేదికగా మరోమారు విజ్ఞప్తి చేశారు.

సీహెచ్‌సీలు సుదూరం...ప్రజలకు నిత్య ఇక్కట్లు

జనసాంద్రత అధికంగా ఉన్న ఈ నియోజకవర్గంలో సామాజిక ఆరోగ్య కేంద్రాలు (సీహెచ్‌సీలు) చాలా దూరంగా ఉండటంతో ప్రజలు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే ఏలూరి ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోనే వైద్య సేవలు అందుబాటులో ఉంటే సకాలంలో చికిత్స అందించి ఎన్నో ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

140కి పైగా కేంద్రాల ఆవశ్యకత... శిథిలావస్థలో పాత భవనాలు

రాష్ట్రవ్యాప్తంగా సుమారు 140 కొత్త పీహెచ్‌సీలు అవసరమని ఇప్పటికే గుర్తించినట్లు, వాస్తవ సంఖ్య ఇంకా అధికంగానే ఉండే అవకాశం ఉందని ఎమ్మెల్యే వెల్లడించారు. దశాబ్దాల క్రితం నిర్మించిన పీహెచ్‌సీ భవనాలు కనీస సదుపాయాలు లేక, పెచ్చులూడిపోతూ శిథిలావస్థకు చేరుకున్నాయని, వాటిని తక్షణమే పునరుద్ధరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని సభ దృష్టికి తెచ్చారు.

ప్రాథమిక వైద్య పరికరాల కొరతపైనా దృష్టి

ఇప్పటికే ఉన్న పీహెచ్‌సీలకు మరింత మెరుగైన వైద్య పరికరాలు, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని కూడా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు విజ్ఞప్తి చేశారు. రోగుల ప్రాథమిక ఆరోగ్య పరిస్థితిని (వైటల్స్) నమోదు చేసేందుకు అవసరమైన కనీస వైద్య పరికరాలను పీహెచ్‌సీలకు సమకూర్చాలని కోరారు. ప్రజారోగ్య పరిరక్షణలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొంటూ, ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని తగిన చర్యలు చేపట్టాలని మంత్రిని ఎమ్మెల్యే ఏలూరి కోరారు.

శ్రీ వార్త
జాతీయ తెలుగు దినపత్రిక
శుక్రవారం - 21 -ఆగష్టు - 2026

# 2 గంటలకో స్కామ్ మెసేజ్

## సందేశం, మెయిల్, సోషల్ మీడియా రూపంలో రాక లింక్ లేకుండా మెసేజ్‌లతో వల వేస్తున్న నేరగాళ్లు బాధితులను మళ్లీ లక్ష్యంగా చేసుకుంటున్న స్కామర్స్



ఆన్‌లైన్ వినియోగం విపరీతంగా పెరుగుతుండడంతో డిజిటల్ మోసాలు ఆందోళనకర స్థాయిలో అధికమవుతున్నాయి. నమ్మదగిన సందేశాలు, డీప్‌ఫేక్ వాయిస్, క్యూఆర్ కోడ్స్‌తో సైబర్ నేరగాళ్లు వల వేస్తున్నారు. తమను మోసగాళు లక్ష్యంగా చేసుకున్న విషయం అత్యధికులు గ్రహించడం లేదు. నష్టం జరిగాకే తాము మోసపోయినట్టు గుర్తిస్తున్నారు. కొత్త నంబర్లు, మెసేజ్‌ల ద్వారా మొబైల్‌కు వచ్చే లింక్స్‌ను తెరవకూడదని ఆర్‌బీఐ, బ్యాంకులు, ప్రభుత్వ విభాగాలు హెచ్చరిస్తున్నా, నేరాల సంఖ్య తగ్గడం లేదు.

రోజుకు సగటున 13 మెసేజ్‌లు..: సందేశం, ఈ--మెయిల్ రూపంలో, సోషల్ మీడియా యాప్స్‌లో సగటున రోజుకు 13 మోసపూరిత (స్కామ్) మెసేజ్‌లను భారతీయులు అందుకుంటున్నారు. అంటే రెండు గంటలకో స్కామ్ సందేశం వస్తోందన్న మాట. ఆన్‌లైన్‌లో ఏది నిజమైనదో, ఏది నకిలీదో తెలుసుకోవడానికి సగటున ఒక్కో వ్యక్తి సంవత్సరానికి 102 గంటలు సమయం వెచ్చిస్తున్నారని ఆన్‌లైన్ ప్రొటెక్షన్ సేవలు అందిస్తున్న అంతర్జాతీయ దిగ్గజం మ్యాకఫీ '2026 స్టేట్ ఆఫ్ ద స్కామివర్స్'నివేదిక వెల్లడించింది. స్కామర్స్ కేవలం 30 నిమిషాలు లేదా అంతకంటే తక్కువ సమయంలోనే స్కామ్ పూర్తి చేస్తున్నారని తెలిపింది. బాధితులు సగటున రూ.93,915 నష్టపోయినట్టు వెల్లడించింది.

### లింక్ లేకుండానే..

డెలివరీ నోటీసులు, సబ్‌స్క్రిప్షన్ పునరుద్ధరణ, బ్యాంక్ అలర్ట్ వంటి సందేశాలు కష్టమర్ల నమ్మకాన్ని పొందడానికి సైబర్ నేరగాళ్లు ఉపయోగించే సాధారణ వ్యూహాలుగా మారాయి. కొత్త ఎత్తుగడ ఏమంటే అనుమానాస్పద సోషల్ మీడియా సందేశాలలో 20% ఎటువంటి లింక్ లేకుండా వస్తున్నాయి. 66% మంది వినియోగదారులు ఈ లింక్ రహిత సందేశాలకు స్పందించారు. స్కామర్ల ఉచ్చులో పడడానికి ఈ అంశం కూడా కారణమైంది. రోజుకు కనీసం నాలుగు డీప్‌ఫేక్ వీడియోలు తమకు ఎదురవుతున్నట్టు వినియోగదారులు చెబుతున్నారు. డీప్‌ఫేక్ వీడియోల్లో 65% ఇన్‌స్టాగ్రామ్ వేదికగా దర్శనమిస్తున్నాయి. ప్రతి ఐదుగురిలో ఒకరు వాయిస్--క్లోన్ స్కామ్‌ను ఎదుర్కొన్నారు. వాయిస్--క్లోన్ అంటే కుటుంబ సభ్యులు, సన్నిహితులు, బ్యాంక్ లేదా ప్రభుత్వ అధికారుల గొంతును అనుకరిస్తూ చేసే వాయిస్ మెసేజ్ అన్నమాట.

### అధునాతన వ్యూహాలతో..

సర్వేలో పాల్గొన్న భారతీయుల్లో 70% మంది గత సంవత్సరం తమ సోషల్ మీడియా ఖాతాలు సైబర్ నేరగాళ్ల చేతిలోకి వెళ్లాయని తెలిపారు. తెలియని వ్యక్తుల నుంచి వచ్చిన సందేశాలను తెరవడంలో ఏడాది క్రితం కంటే ఎక్కువ జాగ్రత్తగా ఉన్నామని 82% మంది చెప్పారు. అయినా, స్కామర్లు అధునాతన వ్యూహాల ద్వారా ఇటువంటి వినియోగదారులను కూడా బోల్తా కొట్టిస్తున్నారు. నెటిజన్లను నమ్మించేందుకు సైబర్ నేరగాళ్లు ఏఐ, అధునాతన డిజిటల్ సాధనాలను ఉపయోగిస్తూ ఆర్‌బీఐ, బ్యాంకులు, ట్రాయ్, ఆధార్, ఇతర ప్రభుత్వ సంస్థల పేర్లతో సందేశాలను పంపడంతోపాటు సామాజిక మాధ్యమాలను విరివిగా వాడుతున్నారు.

### సర్వే గురించి..

**నివేదిక పేరు: మ్యాకఫీ 2026 స్టేట్ ఆఫ్ ద స్కామివర్స్**

**ఎందుకు: ఆన్‌లైన్ మోసాలకు సంబంధించి నేరగాళ్ల వైఖరి, ప్రవర్తన, బాధితుల అనుభవాలను తెలుసుకోవడానికి**

**ఏఏ దేశాలు: భారత్, యూఎస్, ఆస్ట్రేలియా, యూకే, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్**

**ఎప్పుడు: 2025 నవంబర్‌లో సర్వే నిర్వహణ**

**ఎవరెవరు: 18 ఏళ్లు పైబడిన 7,592 మందిపై**

### విధానం: ఆన్‌లైన్ వేదికగా

**సర్వేలో పాల్గొన్న 87% మంది భారతీయులు తాము వ్యక్తిగతంగా ఆన్‌లైన్ స్కామ్‌ను అనుభవించామని చెబుతున్నారు. సైబర్ నేరగాళ్ల చేతిలో ఆర్థికంగా నష్టపోయినట్టు 51% మంది వెల్లడించారు.**

**ఒక స్కామర్ తన లక్ష్యాన్ని మోసం చేసి డబ్బు లేదా సమాచారాన్ని దొంగిలించడానికి పట్టిన సమయం కేవలం 5 నిమిషాలే.**

**ఒక సంవత్సరం క్రితం కంటే నేడు తమ వ్యక్తిగత సమాచారం ప్రమాదంలో ఉందని 63% మంది నమ్ముతున్నారు.**

**స్కామ్ బాధితుల్లో 24% మందిని ఏడాదిలోపే సైబర్ నేరగాళ్లు మళ్లీ లక్ష్యంగా చేసుకున్నారు.**

**90% మంది మోసపూరిత క్యూఆర్ కోడ్ అందుకున్నారు. స్కాన్ చేయగానే ప్రమాదకర స్థాయికి 38% మంది చేరుకున్నారు.**

**డీప్‌ఫేక్ స్కామ్‌ను గుర్తిస్తామన్న నమ్మకం లేదని, తమను తాము రక్షించుకోలేమని మూడింట ఒక వంతుకుపైగా మంది తెలిపారు.**

# థైరాయిడ్ ఉన్నవారు బరువు తగ్గాలనుకుంటే ఈ సూచనలు పాటించడం తప్పనిసరి



థైరాయిడ్ తో బాధపడే వారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతుందని చెప్పవచ్చు. ఒక్కసారి ఈ సమస్య బారిన పడితే జీవితాంతం మందులు మింగాల్సిన పరిస్థితి నెలకొంది. మందులు వాడుతున్నప్పటికీ థైరాయిడ్ తో బాధపడే వారు కొన్ని సమస్యలను ఎదుర్కోవాల్సిందే. వాటిల్లో అధిక బరువును తగ్గించుకోవడం కూడా ఒక్కటి. థైరాయిడ్ సమస్యలతో బాధపడుతున్న వారికి బరువు తగ్గడం అంత సులభమైన విషయం కాదని నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా తక్కువ తినండి, ఎక్కువ కదలండి అనే ఫార్ములా అందరికీ పనిచేస్తుందని భావిస్తారు. కానీ హైపోథైరాయిడిజం ఉన్నవారిలో ఈ విధానం కొన్నిసార్లు ప్రతికూల ఫలితాలు ఇస్తుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. థైరాయిడ్ సమస్య ఉన్నవారు ఆహారం తీవ్రంగా తగ్గిస్తే, శరీరం దానిని ఒత్తిడిగా భావిస్తుంది. అప్పుడు శరీరం ఫ్యాట్‌ను కరిగించడం తగ్గించి సర్వైవల్ మోడ్ లోకి వెళుతుంది.

### హార్మోన్ల పనితీరుపై ప్రభావం..

ఈ పరిస్థితిలో శరీరంలో కొన్ని ముఖ్యమైన మార్పులు జరుగుతాయి. ముఖ్యంగా థైరాయిడ్ హార్మోన్‌ల పనితీరు మందగిస్తుంది. టి4 హార్మోన్ నుంచి టి3 హార్మోన్ గా మారే ప్రక్రియ తగ్గిపోతుంది. అదే సమయంలో రివర్స్ టి3 అనే రూపం పెరిగి, ఫ్యాట్ బర్నింగ్ ప్రక్రియను అడ్డుకుంటుంది. ఫలితంగా మెటబాలిజం తగ్గిపోవడం, అలసట పెరగడం వంటి సమస్యలు కనిపిస్తాయి. దీంతో, తక్కువ తిన్నప్పటికీ బరువు తగ్గకపోవడం, మరింత నిరుత్సాహం కలగడం జరుగుతుంది. ఇది క్రమశిక్షణ లోపం కాదు, శరీర సంకేతాల సమస్య అని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. అంటే, శరీరం బరువు తగ్గడాన్ని అడ్డుకోవడం కాదు, అది తనను తాను రక్షించుకోవడానికి ప్రయత్నిస్తుందని నిపుణులు చెబుతున్నారు.

### సరైన పోషకాహారం తీసుకోవాలి..

ఈ సమస్యకు పరిష్కారం ఆహారం తగ్గించడం కాదు, సరైన పోషకాహారం తీసుకోవడమని కూడా వారు తెలియజేస్తున్నారు. ముఖ్యంగా ప్రోటీన్ సరిపడా తీసుకోవడం ద్వారా మెటబాలిజం మెరుగుపడుతుంది. అలాగే మైక్రోన్యూట్రియెంట్స్ (విటమిన్లు, ఖనిజాలు) హార్మోన్‌ల పనితీరుకు సహాయపడతాయి. ఇక ఒత్తిడిని నియంత్రించడం కూడా చాలా కీలకం. నిరంతరం ఒత్తిడిలో ఉంటే శరీరం సర్వైవల్ మోడ్ లోనే కొనసాగుతుంది. అందుకే సరైన ఆహారం, విశ్రాంతి, మానసిక సమతుల్యత అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. అంతేకాకుండా థైరాయిడ్ సమస్య ఉన్నవారు త్వరగా ఫలితాలు ఇవ్వగల క్రాష్ డైట్స్‌కి దూరంగా ఉండాలి. శరీరాన్ని పోషించడం ద్వారా మాత్రమే దీర్ఘకాలికంగా మంచి ఫలితాలు సాధ్యమవుతాయి. థైరాయిడ్‌కు ఆకలి కాదు, పోషణ అవసరమని నిపుణులు చెబుతున్నారు.

# ఓపెన్ ఏఐ మరో షాక్.. ఇక స్మార్ట్ ఫోన్‌లకు చెక్!




ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) తన నూతన ఆవిష్కరణలతో ప్రపంచవ్యాప్తంగా అత్యంత వేగంగా దూసుకుపోతోంది. ఇప్పటివరకూ సాఫ్ట్‌వేర్ వరకే పరిమితమైందనుకుంటున్న ఓపెన్ ఏఐ ఇ?ప్పుడు హార్డ్‌వేర్ రంగంలోకీ గ్రాండ్ ఎంట్రీ ఇస్తోంది. 'డైమ్' అనే కోడ్ నేమ్‌తో కంపెనీ తన మొట్టమొదటి హార్డ్‌వేర్ ఉత్పత్తిగా ఏఐ ఆధారిత ఇయర్‌బడ్స్‌ను తీసుకురానున్నట్లు 'మింట్'తన కథనంలో పేర్కొంది. 'డైమ్' ఇయర్ బడ్స్ కేవలం సంగీతం వినడానికే పరిమితం కాకుండా, వాయిస్ కమాండ్స్ ద్వారా ఏఐ మోడళ్లను నియంత్రించేలా, హ్యాండ్స్-ఫ్రీ అసిస్టెన్స్‌ను అందించేలా రూపొందించారు. ఈ ఏడాది చివరిలో వీటిని ప్రపంచానికి పరిచయం చేసి, 2027 ప్రారంభంలో మార్కెట్లోకి వీటిని విడుదల చేసే అవకాశం ఉంది. 'స్మార్ట్ పికాచు' అందించిన సమాచారం ప్రకారం చైనాలో ఇటీవల దాఖలైన ఒక పేటెంట్ ఫైలింగ్‌లో 'డైమ్' అనే పేరు వెలుగులోకి వచ్చింది. భారీ స్థాయిలో హార్డ్‌వేర్ పరికరాలను నేరుగా మార్కెట్లోకి తెచ్చే కంటే, వినియోగదారులకు అందుబాటులో ఉండేలా ఇయర్‌బడ్స్ లాంటి సాధారణ పరికరంతో రంగప్రవేశం చేయాలని ఓపెన్ ఏఐ భావిస్తోంది. తక్కువ ఖర్చుతో సాంకేతిక ఇబ్బందులు లేకుండా హార్డ్‌వేర్ మార్కెట్‌ను చేజిక్కించుకోవడమే కంపెనీ వ్యూహమని తెలుస్తోంది. ఇవి వాయిస్ ఇంటరాక్షన్లపై దృష్టి సారిస్తూ, వినియోగదారులకు రియల్ టైమ్ ఏఐ సేవలను నేరుగా చెవి దగ్గరికే చేర్చనున్నాయి. గతంలో ఓపెన్ ఏఐ స్మార్ట్‌ఫోన్ తరహాలో ఉండే శక్తివంతమైన ఏఐ డివైజ్‌ను తీసుకువస్తుందనే ప్రచారం జరిగింది. అయితే హై బ్యాండ్‌విడ్త్ మెమరీ (హెచ్‌బీఎం)కొరత కారణంగా విడిభాగాల ధరలు విపరీతంగా పెరగడంతో ఈ ప్రాజెక్ట్ ప్రస్తుతం వాయిదా పడినట్లు సమాచారం. తయారీ వ్యయం కారణంగా కంపెనీ ప్రస్తుతానికి తన నిర్ణయాన్ని మార్చుకుని, 2026లో సరళమైన వెర్షన్ (డైమ్ ఇయర్‌బడ్స్)ను లాంచ్ చేయాలని నిశ్చయించుకుందని సమాచారం. ఓపెన్ ఏఐ చీఫ్ గ్లోబల్ అఫైర్స్ ఆఫీసర్ క్రిస్ లెహనే గతంలోనే కంపెనీ తొలి హార్డ్‌వేర్ ఉత్పత్తిపై పనిచేస్తున్నట్లు ప్రకటించారు. అయితే అప్పట్లో దాని ఆకారం లేదా ఫీచర్ల గురించి ఎటువంటి స్పష్టత ఇవ్వలేదు. ఈ ఏడాదిలోనే ఆ పరికరాన్ని ఆవిష్కరిస్తామని ఆయన పేర్కొన్నప్పటికీ, లాంచ్ తేదీని వెల్లడించలేదు. ప్రస్తుతం 'డైమ్' బ్రాండింగ్‌తో వస్తున్న ఇయర్‌బడ్స్ వార్తలపై ఓపెన్ ఏఐ ఇంకా స్పందించాల్సి ఉంది. ఆపిల్ మాజీ డిజైన్ హెడ్ జోనీ ఐవ్ నేతృత్వంలో ఈ నూతన పరికరాలు రూపుదిద్దు కుంటున్నాయనే వార్తలు టెక్ ప్రపంచంలో సంచలనంగా మారాయి. కాగా డైమ్ ఇయర్‌బడ్స్ అందుబాటులోకి వస్తే, అవి స్మార్ట్ ఫోన్ల వినియోగానికి చెక్ పెట్టనున్నాయనే వాదన వినిపిస్తోంది.

# ఏఐ పెట్టుబడుల్లో భారత్ - 8

**అగ్రస్థానాల్లో అమెరికా, సింగపూర్**
**వరల్డ్ ఎకనమిక్ ఫోరం తాజా నివేదిక**
**2035 నాటికి భారత జీడీపీకి ఏఐ ఊతం**
**జీడీపీలోకి రానున్న రూ.50 లక్షల కోట్లు**
**పీడబ్ల్యూసీ**

కృత్రిమ మేధ (ఏఐ) రంగంలో ప్రపంచ దేశాల మధ్య పోటీ వేగంగా పెరుగుతున్న వేళ.. పెట్టుబడుల పరంగా భారత్ కూడా ఈ రేసులో ముందంజలోనే ఉందని వరల్డ్ ఎకనమిక్ ఫోరం వెల్లడించింది. 2010 నుంచి 2024 వరకు ఏఐలో అత్యధిక పెట్టుబడులు (జీడీపీలో శాతంగా లెక్కించినప్పుడు) పెట్టిన 11 దేశాల జాబితాలో భారత్‌కు 8వ స్థానం దక్కింది. మరోపక్క.. ఏఐ మనదేశ ఆర్థిక వ్యవస్థకు భారీ ఊతమివ్వనుందని పీడబ్ల్యూసీ ఇండియా తెలిపింది. 2035 నాటికి ఏఐ వల్ల దేశ జీడీపీలోకి సుమారు రూ.50 లక్షల కోట్లు అదనంగా చేరే అవకాశం ఉందని అంచనా వేసింది.

దావోస్‌లో.. ప్రముఖ మేనేజ్‌మెంట్ కన్సల్టింగ్ సంస్థ బెయిన్ అండ్ కంపెనీతో కలిసి వరల్డ్ ఎకనమిక్ ఫోరం ఓ శ్వేత పత్రం విడుదల చేసింది. దాని ప్రకారం.. 2010 నుంచి 2024 వరకు ఏఐలో పెట్టుబడుల పరంగా అమెరికా, సింగపూర్, దక్షిణ కొరియా, చైనా తొలి నాలుగు స్థానాల్లో ఉన్నాయి. ఇదే సమయంలో.. భారత్‌లో ఏఐ పెట్టుబడులు జీడీపీలో 1.2 నుంచి 1.8 శాతం వరకు ఉన్నాయి. అమెరికాలో ఇది రికార్డు స్థాయిలో 3.4 నుంచి 5.1 శాతం, సింగపూర్‌లో 3.1 నుంచి 4.6 శాతం వరకు ఉంది.



### అమెరికా, చైనా దూకుడు

2010--2024 మధ్య కాలంలో ఏఐ రంగంలో పెట్టుబడులు ఏడాదికి సగటున 33 శాతం చొప్పున పెరిగాయని శ్వేతపత్రం తెలిపింది. ఏఐ రంగం అత్యంత ఖరీదైనదనీ, భారీగా పెట్టుబడులు అవసరమైనప్పటికీ తక్షణ లాభాలపై స్పష్టత లేదని పేర్కొనడం విశేషం. కానీ, అమెరికా, చైనా ఈ రంగంలో భారీ పందాలు కాస్తున్నాయి. 2010 నుంచి ఇప్పటివరకు పెట్టిన మొత్తం ఏఐ పెట్టుబడుల్లో 65 శాతం ఈ రెండు దేశాలదే కావడమే అందుకు నిదర్శనం.

### మూడేళ్లలో రూ. 6 లక్షల కోట్లు

భారత్‌లో వచ్చే మూడేళ్లలో రూ.6.14 లక్షల కోట్లకుపైగా ఏఐ పెట్టుబడులు వాస్తవ రూపం దాల్చనున్నాయని వరల్డ్ ఎకనమిక్ ఫోరం అంచనా వేసింది. అలాగే ఏఐకి అవసరమైన అధునాతన చిప్‌లకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో, హార్డ్‌వేర్ రంగంలో పెట్టుబడులు ఏటా 15 నుంచి 25 శాతం వరకు పెరిగే అవకాశముందని తెలిపింది.

### ఆర్థిక వ్యవస్థకూ ఊతం

భారత్ ఆర్థిక వ్యవస్థకు ఏఐ భారీ ఊతమివ్వనుందని పీడబ్ల్యూసీ ఇండియా అంచనా వేసింది. 2035 నాటికి ఏఐ వల్ల దేశ జీడీపీలోకి రూ.50 లక్షల కోట్లకుపైగా అదనంగా వచ్చి చేరే అవకాశం ఉందని వెల్లడించింది. వ్యవసాయం, విద్య, ఇంధనం, ఆరోగ్యం, తయారీ రంగాల్లో ఏఐ వినియోగం వేగంగా పెరిగితే ఈ వృద్ధి సాధ్యమవుతుందని పేర్కొంది. 2050 నాటికి 160 కోట్ల జనాభాకు ఆహారం అందించాలంటే వ్యవసాయ ఉత్పత్తిని 70 శాతం వరకు పెంచాల్సి ఉంటుందని, దీనికి డిజిటల్ సాంకేతికతలు, ముఖ్యంగా ఏఐ అవసరమని పేర్కొంది. అలాగే విద్య, వైద్య రంగాల్లోనూ ఏఐ కీలకపాత్ర పోషించనుందని వివరించింది.

**ఏఐ.. పెట్టుబడులు ఇంతింతై!**

| | దేశం | జీడీపీలో పెట్టుబడి శాతం |
|---|---|---|
| 1 | అమెరికా | 3.4 - 5.1 |
| 2 | సింగపూర్ | 3.1 - 4.6 |
| 3 | దక్షిణ కొరియా | 2.2 - 3.3 |
| 4 | చైనా | 1.7 - 2.6 |
| 5 | యూఏఈ | 1.5 - 2.3 |
| 6 | జపాన్ | 1.5 - 2.2 |
| 6 | కెనడా | 1.5 - 2.2 |
| 7 | యూకే | 1.4 - 2 |
| 8 | భారత్ | 1.2 - 1.8 |
| 9 | యూరప్ (యూకే మినహా) | 1.1 - 1.6 |
| 10 | బ్రెజిల్ | 0.7 - 1.1 |

ఆధారం: వరల్డ్ ఎకనమిక్ ఫోరం శ్వేతపత్రం

ప్రపంచవ్యాప్తంగా డేటా సెంటర్ల వంటి మౌలిక సదుపాయాల కల్పన కోసం ఇప్పటివరకు మొత్తంగా రూ.55 లక్షల కోట్లకు పైగా ఖర్చు చేశారు.

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఉన్న 'భారీ డేటా సెంటర్ల' సంఖ్య 1,136 కాగా 2030 నాటికి ఇది 2,000 దాటొచ్చని అంచనా.

## టాలెంట్ అచీవర్స్ అవార్డు అందుకున్న డాక్టర్ మురుగన్



పలమనేరు ఆగస్టు 20: : తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్ నందు ఆదర్శ కళానిలయం వారిచే పలమనేరు గంటవూర్ బీసీ కాలనీకి చెందిన శ్రీ తిరుపతి గంగమ్మ గుడి చైర్మన్, స్వర్ణ నంది అవార్డు గ్రహీత డాక్టర్ మురుగన్ కు ఆదర్శ కళానిలయం వారు ఆహ్వానించడంతో గురువారం రాత్రి టాలెంట్ అచీవర్స్ అవార్డును డాక్టర్ మురుగన్ కు అందించారు. డాక్టర్ మురుగన్ చేస్తున్న సేవలను గుర్తించి ఈ అవార్డు వారి చేతుల మీదుగా ఆయనకు అందివ్వడం జరిగింది. ఈ అవార్డు తీసుకోవడంతో డాక్టర్ మురుగన్ కు మరింత సేవ చేసే భాగ్యం కలిగిందని ఆయన తెలిపారు. తాను నిరంతరం ప్రజలకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఆయన తెలిపారు. ఈ టాలెంట్ అచీవర్స్ అవార్డు డాక్టర్ మురుగన్ అందుకోవడం వలన మన ప్రాంతానికి గర్వకారణం అదేవిధంగా ఇలాంటి అవార్డులు ఆయన కు తెలంగాణ కర్ణాటక ఆంధ్ర తమిళనాడు రాష్ట్రాలలో ఉన్న వారు డాక్టర్ మురుగన్ చేస్తున్న సేవలను గుర్తించి ఈ అవార్డులు ప్రధానం చేశారు.

## గుంటూరు జిల్లా తుళ్లూరులో భద్రతా ఏర్పాట్లపై ఎస్పీ తనిఖీ....



గుంటూరు జిల్లా ఆగస్టు 20..: తుళ్లూరు: అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో తుళ్లూరులో భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ గురువారం పరిశీలించారు. ఇంటెలిజెన్స్ ఐజీ పకీరప్పతో కలిసి ఆయన వరుసగా 4వ రోజు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అసెంబ్లీకి వచ్చే ప్రధాన మార్గాలు, చెక్‌పోస్టులు, పార్కింగ్ ప్రాంతాలు మరియు ప్రవేశ ద్వారాల వద్ద కట్టుదిట్టమైన తనిఖీలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా భద్రతా పర్యవేక్షణలో డ్రోన్ నిఘా, సీసీ కెమెరాలు, ఆధునిక కమ్యూనికేషన్ వ్యవస్థలను సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. సమావేశాలు ప్రశాంతంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు.

## భూ సమీకరణ వేగవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ సాయి కాంత్ వర్మ




గుంటూరు జిల్లా ఆగస్టు 20 : సి.ఆర్.డి.ఏ రెండవ విడత భూ సమీకరణలో భాగంగా రైతులకు అవగాహన కల్పించాలని , భూ సమీకరణ చేయాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ అన్నారు. భూ సమీకరణపై సి.ఆర్.డి.ఏ కార్యాలయంలో గురువారం సమీక్షించారు. నోటిఫై చేసిన భూముల సమీకరణ ఆవశ్యమని అందుకు రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. ఈ సమావేశంలో సి.ఆర్.డి.ఏ అదనపు కమిషనర్ లు ఎ.భార్గవ తేజ, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు, తెనాలి రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీరమణి, సి.ఆర్.డి.ఏ డిప్యూటీ కలెక్టర్ లు, సంబంధిత మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

## కుంకలమర్రు గ్రామంలో తాగునీటి సమస్యపై జిల్లా కలెక్టర్ డా. వినోద్ కుమార్ ఆకస్మిక తనిఖీ



బాపట్ల జిల్లా ఆగస్టు 20 : త్రాగునీటి సమస్య పరిష్కారమునకు జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వి చర్యలు తీసుకొని అధికారులకు పలు సూచనలు చేశారు. కారంచేడు మండలం, కుంకలమర్రు గ్రామంలో త్రాగునీటి సమస్యపై జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వి, గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కుంకులమర్రు గ్రామంలో పంచాయతీ నీటి సరఫరా, నీటి నాణ్యత ను ఆయన పరిశీలించారు. పంచాయతీ నీటి సరఫరా సమయాలను,వినియోగంపై ఆయన గ్రామస్తులను ఆరా తీశారు. పంచాయతీ సరఫరా చేసే నీరు ఇంటి అవసరాలకు మాత్రమే వినియోగిస్తున్నట్లు వారు తెలిపారు. త్రాగటానికి ఆర్వో ప్లాంట్ నీటిని వాడుతున్నట్లు గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. పంచాయతీ నీటిని త్రాగడానికి వాడకపోవడంకు గల కారణాలపై ఆయన నీటి సరఫరా అధికారులను ఆరా తీశారు. నీటి సరఫరా లో ఫిల్టర్ చేయకపోవుట వలన గ్రామస్తులు ఆ నీటిని త్రాగటానికి ఉపయోగించడం లేదని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం నీటిని నిల్వ చేసే ట్యాంకును, ఫిల్టర్ బెడ్ ను ఆయన తనిఖీ చేశారు. ఫిల్టర్ బెడ్ మరమ్మత్తులు పనులను వేగవంతం చేయాలని, ఫిల్టర్ బెడ్ యొక్క నిర్వహణను పంచాయతీ అధికారులు నిర్వహించాలని ఆయన చెప్పారు. జేజేయం పథకం ద్వారా నిర్వహిస్తున్న ఫిల్టర్ బెడ్ మరమత్తుల పనులను ఒక నెలలోపు పూర్తిచేయాలని, రెండు మాసాలలో ఆ గ్రామంలో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఎంపీడీవోను ఆదేశించారు. గ్రామంలో గ్రామస్తులు యొక్క సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో మురుగునీరు పొలాల్లో కలుస్తుందని ఆ నీటిని దారి మళ్లించాలని గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. పది రోజుల్లో మురుగు నీటిని మళ్లింపు చేసి సంబంధిత ఫోటోలను అందచేయాలని ఆయన ఎంపీడీవోను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రూరల్ వాటర్ సప్లై ఎస్సీ అనంతరాజు, తహసిల్దార్ మాలతీలత, ఆర్డబ్ల్యూఎస్ డి ఈ సతీష్, ఏఈ కార్తీక్, ఇంచార్జి పంచాయతీ సెక్రెటరీ సుమంత్, వీఆర్వో తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన వసతి గృహాలపై కలెక్టర్ డా. వినోద్ కుమార్ ఆకస్మిక తనిఖీ



బాపట్ల జిల్లా ఆగస్టు 20: జిల్లా లో ప్రభుత్వ గిరిజన సంక్షేమ వసతి గృహాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి ఆకస్మిక తనిఖీ నిర్వహించి అధికారులకు పలు సూచనలు చేశారు. గురువారం, బాపట్లలోని బాలికల బాలుర గిరిజన సంక్షేమ వసతి గృహాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తొలుత బాపట్ల తహసిల్దార్ కార్యాలయ రోడ్డులోని సమీకృత గిరిజన సంక్షేమ బాలికల వసతి గృహమును జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వి తనిఖీ చేశారు. వసతి గృహం చుట్టూ పరిసర ప్రాంతాలను ఆయన పరిశీలించారు. వసతి గృహములోని కార్యాలయంలో సిబ్బంది మరియు విద్యార్థుల హాజరు పుస్తకాలను ఆయన పరిశీలించారు. సిబ్బంది వివరాలను, వారు నిర్వహించు పనులను ఆయన ఆరా తీశారు. వసతి గృహ ముందువైపు బాలికల సంరక్షణ కొరకు ప్రహరీ గోడను నిర్మించాలని ఆయన మున్సిపల్ అధికారులకు సూచించారు. అనంతరం బాపట్ల సంజయ్ గాంధీ కాలనీ లోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ కళాశాల బాలుర వసతి గృహమును జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వి తనిఖీ చేశారు. వసతి గృహం యొక్క మూత్రశాల మరియు మరుగుదొడ్లను ఆయన పరిశీలించారు. వంటశాల, భోజనశాలను ఆయన పరిశీలించి భోజనశాలలో తగినంత వెలుతురు ఉండే విధంగా విద్యుత్ దీపాలను, ఫ్యాన్ లను ఏర్పాటు చేయాలని ఆయన అధికారులకు సూచించారు. వసతి గృహ పరిసరాలను ఆయన పరిశీలించారు. వసతి గృహం ఆవరణలో గల పాత వసతిగృహము నిరుపయోగంగా శిథిలావస్థలో ఉన్నందున ఆ భవనమును నేలమట్టం చేయుటకు అనుమతి కొరకు ఈ ఆఫీస్ ద్వారా ఫైల్ పెట్టాలని ఆయన అధికారులకు తెలిపారు. వసతి గృహ ఆవరణలో ఇతరుల వాహనాలు నిలుపుదల చేయుటకు గల కారణాలపై ఆయన వార్డెన్ ను ఆరా తీశారు. ఈ విషయమై వార్డెన్ పై తగు చర్యలకు ఆయన ఆదేశించారు. వసతి గృహం లోని విద్యార్థులు మరియు సిబ్బంది యొక్క హాజరు పుస్తకములను ఆయన పరిశీలించారు. మొత్తం విద్యార్థుల సంఖ్య కు హాజరుకు గల వ్యత్యాసంలపై ఆయన వార్డెన్ ను ఆరా తీశారు.బాలుర వసతి గృహము వార్డెన్ యొక్క పనితీరు సంతృప్తికరంగా లేదని, భోజనం సరిగా లేదని వచ్చిన నివేదిక మేరకు ఆయన వార్డెన్ను ఆరా తీశారు. విద్యార్థులకు అవసరమైన ఆట వస్తువుల గురించి, వసతి గృహమునకు కావలసిన వస్తువులపై సేవా సేతు వెబ్ సైట్ లో పేర్కొన్న వాటి గురించి దాతలకు తెలియజేసి వారి నుండి వారం రోజుల్లోపు ఆ వస్తువులను సేకరించుకోవాలని ఆయన గిరిజన సంక్షేమ శాఖ అధికారిని ఆదేశించారు. వసతి గృహ ఆవరణను పరిశుభ్రంగా ఉంచి మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని, ఆవరణలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని ఆయన అధికారులకు సూచించారు. ఆయన వెంట జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి అమర్ సుబ్బయ్య,బాపట్ల తాసిల్దార్ సలీమా, పురపాలక సంఘ డి.ఈ కృష్ణారెడ్డి, వసతి గృహాల వార్డెన్లు ప్రమోదిని, నాగేశ్వరరావు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక పోరుకు జనసేన సై.. ఆ వ్యూహం గత ఎన్నికలకే పరిమితమన్న పవన్ కల్యాణ్

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని జనసేనకు పవన్ పిలుపు

విధివిధానాల రూపకల్పనకు ఎమ్మెల్యేలు, సీనియర్లతో ప్రత్యేక కమిటీ

సార్వత్రిక ఎన్నికలకు భిన్నంగా స్థానికాల్లో మెరుగైన స్థాయిలో పోటీ

గత ప్రభుత్వ హయాంలో పోరాడిన శ్రేణుల స్ఫూర్తిని గౌరవిస్తామని హామీ

కొన్నిచోట్ల కూటమి ధర్మం పాటించడం లేదని ఎమ్మెల్యేల ప్రస్తావన



అమరావతి: రాష్ట్రంలో త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు జనసేన పార్టీ సమాయత్తమవుతోంది. ఈ ఎన్నికలే లక్ష్యంగా పక్కా వ్యూహంతో ముందుకు సాగాలని పార్టీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నిర్ణయించారు. సార్వత్రిక ఎన్నికల్లో అనుసరించిన వ్యూహానికి భిన్నంగా, క్షేత్రస్థాయి బలాబలాలకు అనుగుణంగా ఈ ఎన్నికల్లో జనసేన ప్రభావశీలమైన పోటీ ఇస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఇందుకు అవసరమైన విధివిధానాల రూపకల్పనకు ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులతో కూడిన ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. గురువారం శాసనసభ ప్రాంగణంలోని తన కార్యాలయంలో జరిగిన జనసేన శాసనసభ పక్ష సమావేశంలో ఆయన పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో జరిగిన స్థానిక ఎన్నికల్లో ఎన్నో దాడులు, బెదిరింపులు, ఒత్తిళ్లు ఎదురైనా ధైర్యంగా నిలబడిన జనసైనికులు, వీర మహిళల పోరాట స్ఫూర్తిని ఎప్పటికీ విస్మరించబోమని అన్నారు. వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టేలా ఈ ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. “నామినేషన్ వేయలేని పరిస్థితులు సృష్టించినా, అప్పటి పాలకులను ఎదిరించి పోటీలో నిలిచిన మన శ్రేణుల త్యాగం విలువైనది. వారి స్ఫూర్తికి తగిన గౌరవం దక్కేలా ఈసారి జనసేన నిలబడుతుంది” అని ఆయన పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని, అప్పటి దాష్టీక పాలనను అంతం చేయాలనే లక్ష్యంతోనే జనసేన కేవలం 21 స్థానాలకు పరిమితమై పోటీ చేసిందని పవన్ కల్యాణ్ గుర్తుచేశారు. ఆ వ్యూహం కేవలం ఆ ఎన్నికలకే పరిమితమని, స్థానిక ఎన్నికల్లో ప్రాంతాలవారీగా రాజకీయ, సామాజిక పరిస్థితులకు అనుగుణంగా వ్యూహాలు ఉంటాయని వివరించారు. ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాలకే పరిమితం కాకుండా, తమ పరిధిలోని ఇతర ప్రాంతాల్లో జనసేన బలాబలాలను అంచనా వేయాలని ఆదేశించారు. పోటీకి అనువైన స్థానాలను గుర్తించి, పార్టీ కేంద్ర కార్యాలయానికి నివేదిక ఇవ్వాలని సూచించారు. రాబోయే ఎన్నికల కార్యాచరణ, విధివిధానాల రూపకల్పన కోసం 9 నుంచి 11 మంది సభ్యులతో ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో కార్యకర్తల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటూ ఈ కమిటీ పనిచేస్తుందని అన్నారు. ఈ సమావేశంలో కొందరు ఎమ్మెల్యేలు, కొన్ని నియోజకవర్గాల్లో మిత్రపక్షాల నేతల వైఖరి వల్ల శ్రేణుల్లో అసహనం వ్యక్తమవుతోందని, కూటమి ధర్మానికి భిన్నంగా వ్యవహరిస్తున్నారని పవన్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన పవన్ కల్యాణ్, ఈ అంశాలు తన దృష్టిలో ఉన్నాయని, పార్టీ శ్రేణుల మనోభావాలను తప్పక గౌరవిస్తామని హామీ ఇచ్చారు. వారికి రాజకీయంగా అండగా నిలుస్తూ, మెరుగైన అవకాశాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ఈ సుదీర్ఘ సమావేశంలో రాష్ట్ర మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేశ్, ఏపీ గ్రీన్ కార్యనిర్వాహక కమిటీ ఛైర్మన్ నాగబాబు, రాజ్యసభ సభ్యుడు లింగమనేని రమేశ్, ప్రభుత్వ విప్‌లు బొమ్మిడి నాయకర్, బొలిశెట్టి శ్రీనివాస్ సహా పలువురు జనసేన ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

## జిల్లాకు పెద్ద సంఖ్యలో పర్యాటకులు వచ్చేలాగా ప్రణాళిక

జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్,వి.,



బాపట్ల జిల్లా ఆగస్టు 20 : జిల్లాలో పర్యాటక ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు వసతులు, సౌకర్యాలుమెరుగుపరచడంతో పాటు జిల్లాకు వచ్చే పర్యాటకుల సంఖ్య పెరిగేలా సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్,వి., పేర్కొన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్ లోని న్యూ వి సి హాల్ నందు జిల్లాలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి, పర్యాటకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చేపట్టాల్సిన చర్యలపై సంబంధిత అధికారుల తో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పర్యాటక అభివృద్ధిపై గత మే 29న తొలి సమావేశం నిర్వహించగా, రెండో సమావేశాన్ని నిర్వహించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో పర్యాటక ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు వసతులు, సౌకర్యాలుమెరుగుపరచడంతో పాటు జిల్లాకు వచ్చే పర్యాటకుల సంఖ్య పెరిగేలా సమగ్ర ప్రణాళికతో ముందుకు తీసుకెళ్లాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బాపట్ల జిల్లాలోని పర్యాటక ప్రాంతాలకు సంబంధించిన సమాచారాన్ని విస్తృతంగా చేరువ చేసేందుకు బే ఆఫ్ బాపట్ల వెబ్‌సైట్‌ను మరింత ప్రాచుర్యంలోకి తీసుకురావాలని,వైబ్ సైట్ నందు పర్యాటక ప్రాంతాల పూర్తి సమాచారాన్ని అందు పెట్టాలని, వెబ్‌సైట్‌ను ప్రజలు, పర్యాటకులు ఎక్కువగా వీక్షించేలా విస్తృత ప్రచారం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సెప్టెంబర్ 27న నిర్వహించే ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అందించే పర్యాటక ప్రతిభా పురస్కారం బాపట్ల జిల్లాకు దక్కేలా అవసరమైన వివరాలతో దరఖాస్తు చేయాలని జిల్లా పర్యాటక శాఖ అధికారి బెన్హర్‌ను కలెక్టర్ ఆదేశించారు. జిల్లా సముద్ర తీర ప్రాంతాల్లో పర్యాటక అభివృద్ధికి మరింత ప్రోత్సాహం కల్పించే ఉద్దేశంతో సూర్యలంక, ఓడరేవు, రామాపురం, పొట్టి సుబ్బయ్యపాలెం ప్రాంతాల్లో టోల్‌గేట్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. టోల్‌గేట్ల ద్వారా సమకూరే ఆదాయంలో 50 శాతం సంబంధిత పంచాయతీకి, మరో 50 శాతం పర్యాటక అభివృద్ధికి వినియోగించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా పర్యాటక శాఖ అధికారి ని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పర్యాటక శాఖ అధికారి బెన్హర్,జిల్లా మత్స్య శాఖ సహాయ సంచాలకులు గాలిదేవుడు,అటవీశాఖ వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మూడు రాష్ట్రాలను కలుపుతూ కుప్పం మీదుగా బుల్లెట్ ట్రైన్ కారిడార్..

### సీఎం చంద్రబాబు కీలక ప్రతిపాదన

అమరావతి, బెంగళూరు, చెన్నైలను కుప్పం మీదుగా అనుసంధానం

గోదావరి-కావేరి నదుల అనుసంధానంతో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

విభజన సమస్యలను త్వరగా తేల్చాలని కేంద్రానికి విజ్ఞప్తి

దక్షిణ మండల మండలి సమావేశంలో సీఎం చంద్రబాబు కీలక సూచనలు



అమరావతి: దక్షిణ భారతదేశంలోని మూడు కీలక రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడులను కలుపుతూ అత్యంత ప్రతిష్టాత్మకమైన బుల్లెట్ ట్రైన్ కారిడార్‌ను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదించారు. మూడు రాష్ట్రాల రాజధానులు, ప్రధాన పారిశ్రామిక కేంద్రాలైన అమరావతి, బెంగళూరు, చెన్నైలను అనుసంధానించే ఈ హై-స్పీడ్ రైలు ప్రాజెక్టును చేపట్టాలని ఆయన సూచించారు. ముఖ్యంగా తన నియోజకవర్గమైన కుప్పం మీదుగా ఈ కారిడార్ వెళ్లేలా ప్రణాళిక రూపొందించాలని కోరారు. గురువారం మహాబలిపురంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా అధ్యక్షతన జరిగిన దక్షిణ మండల మండలి సమావేశంలో చంద్రబాబు ఈ కీలక ప్రతిపాదనలు చేశారు. ఈ మూడు నగరాలు ఇప్పటికే పారిశ్రామికంగా, సాంకేతికంగా గణనీయమైన అభివృద్ధి సాధించాయని, వాటి మధ్య హై-స్పీడ్ రైలు మార్గం ఏర్పాటు చేస్తే రవాణా వ్యవస్థ బలోపేతమై ఆర్థికాభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని చంద్రబాబు వివరించారు. ఈ ప్రాజెక్టు ద్వారా వాణిజ్య, పారిశ్రామిక కార్యకలాపాలు ఊపందుకుంటాయని, ఇది దక్షిణాది రాష్ట్రాల సమగ్ర అభివృద్ధిలో ఒక మైలురాయిగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇదే సమావేశంలో, దేశవ్యాప్తంగా ఆధ్యాత్మిక పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు చంద్రబాబు మరో ముఖ్యమైన సూచన చేశారు. దక్షిణాదిలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలైన తిరుపతి, శ్రీశైలం, కాంచీపురం, మధురై, రామేశ్వరం వంటి వాటిని.. ఉత్తర భారతదేశంలోని వారణాసి, అయోధ్య, చార్‌ధామ్ వంటి ఆధ్యాత్మిక కేంద్రాలతో అనుసంధానిస్తూ ప్రత్యేక వారసత్వ, పర్యాటక, తీర్థ యాత్ర సర్క్యూట్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఇది దేశ సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడంతో పాటు పర్యాటక రంగానికి కొత్త ఊపునిస్తుందని తెలిపారు. 2047 నాటికి భారత్‌ను 30-35 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా నిలపాలన్న జాతీయ లక్ష్యంలో దక్షిణాది రాష్ట్రాలు ప్రధాన భూమిక పోషిస్తాయని చంద్రబాబు అన్నారు. ప్రస్తుతం దేశ జీడీపీలో దక్షిణాది ఐదు రాష్ట్రాల వాటా 31 శాతంగా ఉందని గుర్తుచేశారు. ఆంధ్రప్రదేశ్ 2.4 ట్రిలియన్ డాలర్లు, తమిళనాడు 2.6 ట్రిలియన్ డాలర్లు, కర్ణాటక 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థలుగా ఎదిగే లక్ష్యాలు నిర్దేశించుకున్నాయని, తద్వారా దక్షిణాది రాష్ట్రాలన్నీ కలిసి 10 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా ఎదుగుతాయని ఆయన వివరించారు. ఈ లక్ష్యాల సాధనకు కేంద్ర ప్రభుత్వం సహకారం అందించాలని కోరారు.

# వేసవిలో చెరకు రసం తాగితే డీహైడ్రేషన్, ఎండ దెబ్బ రాకుండా ఆపవచ్చా..?



వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు పెరిగే కొద్దీ శరీరాన్ని చల్లబరచేందుకు చాలా మంది సహజంగానే చల్లని పానీయాలవైపు మొగ్గు చూపుతారు. నిమ్మరసం (నీంబూ పానీ), చల్లని లస్సీలు వంటి సంప్రదాయ పానీయాలు తక్షణ ఉపశమనం ఇస్తాయని భావిస్తారు. ఈ జాబితాలో చెరకు రసం (షుగర్‌కేన్ జ్యూస్) కూడా ప్రముఖంగా ఉంటుంది. ఇది సహజంగా తీయగా, తాజాగా అనిపించడంతోపాటు శరీరాన్ని చల్లబరుస్తుందని చాలామంది నమ్మకం. అయితే తీవ్రమైన ఎండలో ఇది నిజంగా హీట్ స్ట్రోక్‌ను నివారిస్తుందా? శరీరానికి అవసరమైన హైడ్రేషన్‌ను అందిస్తుందా? అనే విషయాలపై చెరకు రసం గురించి కొన్ని అపోహలు ఉన్నాయి. వాటిని వైద్యులు వివరిస్తున్నారు.

## హైడ్రేషన్ జరుగుతుందా..

హీట్ స్ట్రోక్ అనేది శరీరం తన ఉష్ణోగ్రతను నియంత్రించలేని ప్రమాదకర పరిస్థితి. ఇది ముఖ్యంగా డీహైడ్రేషన్, ఎలక్ట్రోలైట్ లోపం వల్ల వస్తుంది. చెరకు రసం తాగితే చల్లగా అనిపించినా, ఇది హీట్ స్ట్రోక్‌ను నివారించడానికి అవసరమైన ముఖ్య పోషకాలను అందించదు. చెరకు రసం ఎలక్ట్రోలైట్ డ్రింక్‌లా పనిచేస్తుందని ఒక పెద్ద అపోహ ఉంది. వాస్తవానికి చెమట ద్వారా శరీరం ఒక లీటర్‌కు సుమారు 900 మిల్లీగ్రాముల సోడియంను కోల్పోతుంది. కానీ ఒక గ్లాస్ చెరకు రసంలో కేవలం 11-17 మిల్లీగ్రాముల సోడియం మాత్రమే ఉంటుంది. సోడియం శరీరంలో నీటిని నిల్వ ఉంచడంలో కీలకం. ఇది తక్కువగా ఉంటే హైడ్రేషన్ పూర్తిగా జరగదు. అందుకే చెరకు రసం తాగడం అంటే అసలు శరీరాన్ని హైడ్రేట్ చేయడం కాకుండా చక్కెర నీరు తాగినట్లే అవుతుందని నిపుణులు చెబుతున్నారు. దీనికంటే కొంచెం ఉప్పు కలిపిన నిమ్మరసం తాగడం ఎంతో మేలు చేస్తుంది.

## అధికంగా చక్కెర..

ఇంకో ముఖ్య అంశం చక్కెర పరిమాణం. ఒక గ్లాస్ చెరకు రసంలో సుమారు 25 నుంచి 40 గ్రాముల వరకు చక్కెర ఉంటుంది. ఇది రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను ఒక్కసారిగా పెంచే ప్రమాదం ఉంటుంది. ముఖ్యంగా ఖాళీ కడుపుతో తాగితే ఇది మరింత ప్రభావం చూపుతుంది. తాత్కాలికంగా శక్తి ఇచ్చినా, దీర్ఘకాలికంగా హైడ్రేషన్‌కు పెద్దగా సహాయపడదు. హైజీన్ కూడా చెరకు రసం విషయంలో పెద్ద సమస్యగా మారుతుంది. రోడ్డుపై అమ్మే జ్యూస్ స్టాళ్లు ఎక్కువసేపు ఎండలో ఉంటాయి. యంత్రాలు సరిగ్గా శుభ్రం చేస్తారని నమ్మకం ఉండదు. వాడే ఐస్ కూడా శుద్ధి చేసిన నీటితో తయారై ఉండదు. ఈ కారణాల వల్ల ఈ.కోలి, టైఫాయిడ్, జాండిస్ వంటి ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఉంటుంది.

## ఉప్పు, నిమ్మరసం కలిపిన నీళ్లు బెటర్..

అయితే వేసవిలో ఏం తాగాలి? అంటే.. నిపుణుల సూచన ప్రకారం సాదాసీదా నీరు అత్యుత్తమం. దానికి నిమ్మరసం, కొంచెం ఉప్పు కలిపితే శరీరానికి అవసరమైన ఎలక్ట్రోలైట్లు అందుతాయి. శరీరంలో నీటిని నిల్వ ఉంచేలా సహాయపడే పానీయాలపై దృష్టి పెట్టడం అవసరం. చెరకు రసం తాగితే తక్షణంగా చల్లగా అనిపించినా, ఇది హీట్ స్ట్రోక్ నివారణకు లేదా సరైన హైడ్రేషన్‌కు విశ్వసనీయ పరిష్కారం కాదు. తక్కువ సోడియం, ఎక్కువ చక్కెర, హైజీన్ సమస్యల కారణంగా దీన్ని అప్పుడప్పుడు మాత్రమే తీసుకోవడం మంచిది. వేసవిలో సరైన హైడ్రేషన్ కోసం నిమ్మరసం, ఉప్పు కలిపిన నీరు వంటి సులభమైన పానీయాలు మరింత ప్రయోజనకరంగా ఉంటాయని నిపుణులు తెలియజేస్తున్నారు.

# 60 రోజుల పాటు జంక్ ఫుడ్‌ను మానేస్తే శరీరంలో జరిగే మార్పులు ఇవే..!



జంక్ ఫుడ్ ఆరోగ్యానికి మంచిది కాదని చాలా మందికి తెలుసు. అయితే దాన్ని పూర్తిగా 60 రోజుల పాటు మానేస్తే శరీరంలో కనిపించని లోతైన మార్పులు జరుగుతాయి. ప్రాసెస్ చేసిన స్నాక్స్, అధిక చక్కెర ఉన్న పదార్థాలు, ఫాస్ట్ ఫుడ్‌ను ఆపేసినప్పుడు శరీరం దెబ్బతిన్న వ్యవస్థలను మళ్లీ సరిచేసుకోవడం ప్రారంభిస్తుంది. తాజా పరిశోధనలు తెలిపిన ప్రకారం కొద్ది రోజులపాటు జంక్ ఫుడ్‌కు విరామం వల్ల ఆకలి నియంత్రణ, జీర్ణ వ్యవస్థ ఆరోగ్యం, మెటబాలిజం మెరుగుపడటానికి దోహదం చేస్తుందని వెల్లడైంది. మొదట కొన్ని వారాలు శుద్ధి దశలా ఉండగా, తర్వాత శక్తి స్థిరంగా మారుతుంది. 60 రోజుల పాటు జంక్ ఫుడ్ మానేస్తే శరీరంలో ఎటువంటి మార్పులు జరుగుతాయో వైద్యులు వివరిస్తున్నారు.

## అతిగా తినడం తగ్గుతుంది..

60 రోజుల పాటు జంక్ ఫుడ్ మానేయడం వల్ల ఆకలి హార్మోన్లు సమతుల్యం అవుతాయి. జంక్ ఫుడ్ వల్ల ఆకలి నియంత్రణ దెబ్బతింటుంది. దీనివల్ల ఎక్కువగా తినే అలవాటు ఏర్పడుతుంది. అయితే 60 రోజుల పాటు దాన్ని మానేస్తే లెప్టిన్, ఘ్రెలిన్ వంటి ఆకలి హార్మోన్లు సరిగా పనిచేయడం ప్రారంభిస్తాయి. దాంతో తృప్తి భావం సరిగ్గా తెలుస్తుంది. అలాగే కాలరీలు సహజంగా తగ్గుతాయి. ప్రాసెస్ చేసిన ఆహారాన్ని తగ్గిస్తే రోజువారీ క్యాలరీలు కూడా ఆటోమేటిక్‌గా తగ్గుతాయి. దాంతో బరువు తగ్గడం, రక్తంలో చక్కెర స్థాయిలు స్థిరంగా ఉండడం, శక్తి తగ్గిపోవడం వంటి సమస్యలు తగ్గుతాయి. జంక్‌ఫుడ్ మానేయడం వల్ల గట్ (జీర్ణ వ్యవస్థ) ఆరోగ్యం మెరుగుపడుతుంది. జంక్ ఫుడ్ గట్‌లో బ్యాక్టీరియా సమతుల్యాన్ని దెబ్బతీస్తుంది. దాన్ని మానేస్తే గట్ లైనింగ్ మళ్లీ బలపడుతుంది, మంచి బ్యాక్టీరియా పెరుగుతుంది. దీనివల్ల జీర్ణక్రియ సులభంగా మారుతుంది. అంతేకాకుండా శరీర మెటబాలిజం మెరుగవుతుంది. ప్రాసెస్ చేసిన ఆహారం తగ్గించడం వల్ల మెటబాలిజం సరిగా పనిచేస్తుంది. ఇన్సులిన్ సెన్సిటివిటీ పెరుగుతుంది. దీని వల్ల శరీరానికి అవసరమైన శక్తి సమర్థంగా ఉత్పత్తి అవుతుంది.

## మెదడు పనితీరుకు..

ఇక జంక్ ఫుడ్ మానేయడం వల్ల మెదడు పనితీరు కూడా మెరుగవుతుంది. జంక్ ఫుడ్ మెదడు పనితీరుపై కూడా ప్రభావం చూపుతుంది. ఇది మెమొరీ, ఆకలి నియంత్రణపై ప్రభావం చూపుతుంది. 60 రోజుల తర్వాత మెదడు మళ్లీ సరిగా స్పందించడం ప్రారంభించి, ఫోకస్ పెరుగుతుంది, అనవసరమైనవి తినాలనే కోరికలు తగ్గుతాయి. అంతేకాకుండా శరీరంలో ఇన్‌ఫ్లమేషన్ (వాపు) తగ్గుతుంది. జంక్ ఫుడ్ వల్ల శరీరంలో ఇన్‌ఫ్లమేషన్ పెరుగుతుంది. ఇది గుండె జబ్బులు, ఇతర సమస్యలకు దారి తీస్తుంది. రెండు నెలలు ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటే ఇన్‌ఫ్లమేషన్ తగ్గి, చర్మం మెరుగుపడటం, ఉబ్బరం తగ్గడం, కీళ్ల నొప్పులు తగ్గడం వంటి ప్రయోజనాలు కనిపిస్తాయి. 60 రోజులు జంక్ ఫుడ్ మానేయడం కొంచెం కష్టంగా అనిపించినా, శరీరం చాలా త్వరగా ధన్యవాదాలు చెబుతుందని, బయట కనిపించే మార్పుల కంటే లోపల జరిగే మార్పులే ఆరోగ్యానికి అత్యంత ముఖ్యమైనవని నిపుణులు తెలియజేస్తున్నారు.

# పచ్చి మామిడి వర్సెస్ మామిడి పండు.. ఏయే పదార్థాల తయారీకి వేటిని వాడాలి..



మామిడి సీజన్ ప్రారంభమైతే మార్కెట్లు పచ్చి మామిడిపండ్ల నుంచి పండిన తీయని మామిడిపండ్లతో నిండిపోతాయి. ప్రతి ఒక్కరు వారికి నచ్చినవి కొనుగోలు చేసి వాటి రుచిని ఆస్వాదిస్తూ ఉంటారు. ఈ రెండింటికీ ప్రత్యేకమైన రుచి ఉండడంతోపాటు వంటల్లో వీటి ఉపయోగం కూడా వేరుగా ఉంటుంది. పచ్చి మామిడి తియ్యని, పులుపు రుచిని అందిస్తే, పండిన మామిడి సహజమైన తీపి, మృదుత్వాన్ని అందిస్తుంది. అందువల్ల వీటిని ఒకే పండుగా కాకుండా, వేర్వేరు పదార్థాలుగా చూడటం ఉత్తమం. పచ్చి మామిడి ప్రధానంగా పులుపు, కరకరలాడే టెక్స్చర్‌తో ఉంటుంది. అందుకే వంటల్లో తాజాదనాన్ని తీసుకురావడానికి ఇది ఉపయోగపడుతుంది. వేసవిలో పచ్చి మామిడి ఉల్లాసాన్ని పెంచే రుచిని అందిస్తుంది. పచ్చి మామిడితో చేసే వంటల్లో ఆవకాయలు, పచ్చళ్ళు ముఖ్యమైనవి. కాయ గట్టిగా ఉండటం వల్ల మసాలాలు, నూనె కలిసిపోతాయి. పచ్చి మామిడి చట్నీలు కూడా భోజనానికి రుచిని పెంచుతాయి.

## ఆమ్ పన్నా ఆరోగ్యకరం..

సలాడ్లు, కచుంబర్‌లలో తురిమిన పచ్చి మామిడి కలిపితే రుచిలో ప్రత్యేకమైన మార్పు వస్తుంది. క్యారెట్, కీరదోసకాయ, పల్లీలు వంటి పదార్థాలతో కలిపితే కరకరలాడే, రుచికరమైన మిశ్రమంగా మారుతుంది. దాల్, కర్రీలలో కూడా పచ్చి మామిడి ఉపయోగిస్తారు. ఇది వంటకానికి తేలికపాటి పులుపును అందించి, రుచిని సమతుల్యం చేస్తుంది. కొబ్బరి ఆధారిత కర్రీల్లో ఇది తేలికపాటి తీపి-పులుపు సమతుల్యతను కలిగిస్తుంది. అలాగే వేసవిలో పచ్చి మామిడితో చేసే పానీయాల్లో ఆమ్ పన్నా ముఖ్యమైనది. ఇది శరీరానికి చల్లదనం ఇవ్వడంతోపాటు తక్షణ శక్తిని అందిస్తుంది. బెల్లం, మసాలాలు కలిపి తయారు చేసే ఈ పానీయం వేసవిలో ప్రత్యేకమైన ఉపశమనాన్ని ఇస్తుంది.

## అల్పాహారంగా పనిచేసే మామిడి పండ్లు..

ఇక పండిన మామిడి తీపి, సువాసన, మృదుత్వంతో వంటల్లో ప్రధాన పాత్ర పోషిస్తుంది. దీన్ని డెజర్ట్‌లోనూ, పానీయాల్లోనూ విస్తృతంగా ఉపయోగిస్తారు. శ్రీఖండ్, కలాకండ్ వంటి మిఠాయిల్లో పండిన మామిడి అద్భుతంగా సరిపోతుంది. మామిడిని క్రీమ్‌తో కలిపినా, కేకులు, మఫిన్స్‌ల్లో వాడినా ప్రత్యేకమైన రుచి ఇస్తుంది. స్మూతీలు, లస్సీలు, బౌల్స్‌లో పండిన మామిడి గట్టిగా, క్రీమీ టెక్స్చర్‌ను ఇస్తుంది. పెరుగు, పాలు లేదా కొబ్బరితో కలిపి తీసుకుంటే పోషకాహారంగా ఉంటుంది. ఇవి వేసవిలో త్వరగా తయారయ్యే అల్పాహారంగా కూడా ఉపయోగపడతాయి. పండిన మామిడితో సాల్సాలు, టాపింగ్స్ కూడా తయారు చేయవచ్చు. ఉల్లిపాయలు, కొత్తిమీర, నిమ్మరసం, మిరపకాయలతో కలిపితే తీపి-కారం సమతుల్యతతో వంటకానికి కొత్త రుచిని అందిస్తుంది. కొన్ని ప్రాంతీయ కర్రీల్లో కూడా పండిన మామిడి వాడతారు. బెంగాలీ, గోవా వంటల్లో ఇది మసాలాలతో కలిసిపోతూ తేలికపాటి తీపి రుచిని ఇస్తుంది. పచ్చి మామిడి ఉత్సాహం, పులుపు, కరకరలాడే గుణాన్ని ఇస్తే, పండిన మామిడి తీపి, మృదుత్వం, సంతృప్తిని అందిస్తుంది. వంటకానికి అవసరాన్ని బట్టి వీటిని ఎంచుకుంటే ప్రతి వంటకాన్ని ప్రత్యేకంగా మార్చుకోవచ్చు. వేసవి కాలంలో ఈ రెండు రకాల మామిళ్లతో ఎన్నో రుచికరమైన వంటకాలు సిద్ధం చేసుకోవచ్చు.

# ప్రకృతి వ్యవసాయంపై నీతి ఆయోగ్ కరదీపిక

### ప్రకృతి సేద్య పద్ధతులపై ప్రామాణిక శిక్షణా మాన్యువల్‌ను వెలువరించిన నీతి ఆయోగ్

### 22 రకాల పంటల్లో ప్రకృతి సేద్య పద్ధతులపై పూర్తి సమాచారం

### రసాయనిక-సేంద్రియ-ప్రకృతి సేద్యాల మధ్య వ్యత్యాసాలపైనా వివరణ



ప్రకృతి వ్యవసాయాన్ని దేశవ్యాప్తంగా విస్తృతంగా వ్యాప్తిలోకి తేవాలన్న లక్ష్యంతో సమగ్రమైన ట్రైనింగ్ మాన్యువలీన్ను కేంద్ర ప్రభుత్వ సంస్థ నీతి ఆయోగ్ ఇటీవలే వెలువరించింది. 'రైతులకు సాధికారత కల్పించటం: ప్రకృతి వ్యవసాయ శిక్షణా కిట్ -- ఉత్తమ పద్ధతుల మార్గదర్శిని' పేరుతో రూపొందించారు. ప్రకృతి సేద్య మూల సూత్రాలతో పాటు.. ముఖ్యమైన 22 రకాల పంటల సాగులో క్షేత్రస్థాయిలో ఆచరించదగిన ప్రామాణిక ప్రకృతి సేద్య పద్ధతులను పొందుపరిచారు. నీతి ఆయోగ్ వ్యవసాయం--సాంకేతిక విజ్ఞాన విభాగం ప్రోగ్రామ్ డైరెక్టర్ డాక్టర్ నీలం పటేల్, కన్సల్టెంట్ పరెమల్ బనఫర్ ఆధ్వర్యంలో నిపుణుల బృందం దీన్ని రూపొందించింది. రైతులు, విస్తరణ సిబ్బంది, విధాన నిర్ణేతలకు సుస్థిర వ్యవసాయ విస్తరణ దిశా నిర్దేశం చేయటానికి ఈ శిక్షణా మాన్యువల్, ఉత్తమ ప్రకృతి సేద్య పద్ధతులకు అక్షర రూపం ఇచ్చినట్లు నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ సుమన్ బెరీ పేర్కొన్నారు. డాక్టర్ నీలం పటేల్ ఇలా అన్నారు: 'దేశవ్యాప్తంగా రైతులు అనుసరిస్తున్న ప్రకృతి సేద్య పద్ధతులు, ఆవిష్కరణలు, సంప్రదాయ విజ్ఞానంతో పాటు వివిధ రాష్ట్ర ప్రభుత్వాల ప్రకృతి సేద్య అనుభవాల ఆధారంగా ఈ శిక్షణా మాన్యువల్‌ను రూపొందించాం. దేశంలో సుస్థిర వ్యవసాయాన్ని విస్తరింపజేయటంలో ఇదొక కీలక ముందడుగు'. ప్రకృతి వ్యవసాయ వారసత్వాన్ని సుసంపన్నం చేసిన సుభాష్ పాలేకర్ (మహారాష్ట్ర), ఎల్. నారాయణరెడ్డి (కర్ణాటక), శ్రీపాద దబోల్కర్, జి. నమ్మాళ్వార్ (తమిళనాడు), దీపక్ సచ్‌దే (మధ్యప్రదేశ్), భాస్కర్ సావే (గుజరాత్)ల సేవలను ఇందులో ప్రస్తుతించారు. దేశవ్యాప్తంగా ప్రకృతి సేద్య పథకాలు అమలవుతున్నాయని, 9.4 లక్షల హెక్టార్లలో సుమారు 10 లక్షల మంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని ఇందులో పేర్కొన్నారు.

## అధిక దిగుబడి.. అధిక నికరాదాయం!

వరిని వరుసగా 4 ఏళ్లు ప్రకృతి వ్యవసాయం (ప్ర.వ్య.)లో పండిస్తే 2023 ఖరీఫ్‌లో ఎకరానికి 33.75 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వచ్చింది. రసాయన వ్యవసాయం (ర.వ్య.)లో 31.5 క్వింటాళ్లు వచ్చింది. ఈ రెండు ధాన్యాలను క్వింటా రూ.2,040కే విక్రయించారు. ప్ర.వ్య.లో నికరాదాయం రూ.48 వేలు రాగా, రూపాయి ఖర్చుకు 2.3 రూపాయల ఆదాయం ముచ్చింది. ర.వ్య.లో నికరాదాయం రూ.35,140 రాగా, రూపాయి ఖర్చుకు 1.2 రూపాయలు మాత్రమే ఆదాయం వచ్చింది. ప్రధాన పంటలన్నింటిలో సాగు ఖర్చును కనీసం 5--10% తగ్గిస్తుంది. మరికొన్ని పంటల్లో, కొన్ని రాష్ట్రాల్లో 20--55% వరకు తగ్గింది.
- ప్రకృతి వ్యవసాయం రైతులు, వినియోగదారుల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. నేలల్లో సేంద్రియ కర్బనం 1947లో 2.5% ఉండేది. ఇప్పటికి 0.4%కి తగ్గింది. ప్రకృతి వ్యవసాయం దీన్ని 45% వరకు పెంచుతుంది.
- నీరు, విద్యుత్‌లో 50--60% ఆదా అవుతుంది.
- కర్బన ఉద్గారాలను 55--85% తగ్గిస్తుంది.
- పశువులను ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పెంచటం రైతులకు లాభదాయకంగా ఉంటుంది. పంటల వైవిధ్యం, అంతరపంటలు, బహుళ అంచెల పంటలతో వ్యవసాయాదాయ భద్రత, పోషకాహార భద్రత పెరుగు తాయి. రసాయనిక సేద్యం ఏకపంట సాగుతో పోలిస్తే 20--40% అధిక నికర ఆదాయం వస్తుంది.

## జీవామృతం.. 48 గంటలు పులిస్తే చాలు!

జీవామృతం కోసం పేడ, మూత్రం, పప్పుల పిండి, బెల్లం, మట్టిని డ్రమ్ము నీటిలో కలిపిన తర్వాత 2--3 రోజులు పులియబెట్టి పంటలకు వాడుకోడానికి సిద్ధమైనట్లే. కలిపిన 48 గంటల్లో బ్యాక్టీరియా పూర్తిస్థాయిలో వృద్ధి చెందుతుంది. సిద్ధమైన జీవామృతాన్ని వేసవిలో 7 రోజుల వరకు, శీతాకాలంలో 8--10 రోజుల్లో వాడుకోవచ్చని నీతి ఆయోగ్ ప్రకృతి వ్యవసాయ శిక్షణ మాన్యువల్ చెబుతోంది.

## ప్రకృతి సేద్యానికి మార్గదర్శకం

రసాయనిక వ్యవసాయానికి ఒక సుస్థిరమైన ప్రత్యామ్నాయం ప్రకృతి వ్యవసాయం. ఇటు సంప్రదాయ విజ్ఞానాన్ని అటు ఆధునిక పర్యావరణ విజ్ఞానాన్ని ఇముడ్చుకొని ప్రకృతి వ్యవసాయ పద్ధతులు రూపొందాయి. ప్రస్తుతం ఆధునిక వ్యవసాయంలో ఎదురవుతున్న సవాళ్లకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు దీటైన సమాధానాలు ఇవ్వగలవు. తక్కువ వనరులతో, తక్కువ ఖర్చుతోనే వ్యవసాయానికి సుస్థిరత చేకూర్చటం సాధ్యమని ఈ పద్ధతులు చాటి చెబుతున్నాయి. దేశవ్యాప్తంగా రైతులకు, విస్తరణ సిబ్బందికి ప్రకృతి సేద్య పద్ధతులపై శిక్షణ ఇవ్వటానికి ఈ మాన్యువల్ మార్గదర్శకంగా నిలుస్తుంది.

# వేసవిలో శరీరానికి చల్లదనాన్ని, పోషకాలను అందించే అద్భుతమైన పానీయం ఇది.. ఎలా తయారు చేయాలంటే..?



వేసవి కాలం ప్రారంభమయ్యాక చల్లని పానీయాలు రోజువారీ జీవితంలో భాగమవుతాయి. మార్కెట్‌లో రెడీమేడ్ డ్రింక్స్, మిక్స్‌లు సులభంగా లభిస్తున్నప్పటికీ, సంప్రదాయ భారతీయ పానీయాలకు ప్రత్యేక స్థానం ఇప్పటికీ ఉంది. అలాంటి ప్రసిద్ధ పానీయాల్లో తండాయి ఒకటి. ఇది రుచితోపాటు శరీరాన్ని చల్లబరచే గుణాల వల్ల ప్రత్యేకంగా గుర్తింపు పొందింది. సాధారణంగా హోలీ పండుగ సమయంలో ఎక్కువగా తయారుచేసే తండాయి, వేసవి మొత్తం తాగడానికి అనువైన పానీయం. పాలు, డ్రై ఫ్రూట్స్, సుగంధ ద్రవ్యాలు, గులాబీ రేకులు, కుంకుమపువ్వు కలిపి తయారు చేసే ఈ పానీయం శరీరానికి శక్తిని అందించడమే కాకుండా, తాగిన వెంటనే తాజాగా అనిపించేలా చేస్తుంది. ఇంట్లో తండాయి మసాలా తయారు చేసుకోవడం వల్ల మనకు కావలసిన రుచులు, తీపి స్థాయి అన్నీ మనమే నియంత్రించుకోవచ్చు.

## ఇలా చేయాలి..

ఇంట్లో తండాయి మసాలా తయారీ చాలా సులభం. బాదం, జీడిపప్పు, పిస్తా వంటి డ్రై ఫ్రూట్స్‌తో పాటు సోంపు, గసగసాలు, యాలకులు, మిరియాలు వంటి సుగంధ ద్రవ్యాలు ప్రధానంగా ఉపయోగిస్తారు. వీటితోపాటు గులాబీ రేకులు, కుంకుమపువ్వు కూడా ప్రత్యేక సువాసనను ఇస్తాయి. తయారీ విధానంలో మొదట అన్ని డ్రై ఫ్రూట్స్, గింజలను శుభ్రంగా కడిగి పూర్తిగా ఆరబెట్టాలి. తేమ లేకుండా ఉండేలా చూసుకోవాలి. తరువాత యాలకులు, మిరియాలు, సోంపు, గసగసాలు మొదటగా మెత్తగా పొడి చేయాలి. తరువాత బాదం, జీడిపప్పు, పిస్తా, మెలన్ గింజలను వేసి కొద్దిగా దట్టంగా ఉండేలా గ్రైండ్ చేయాలి. ఆ తరువాత గులాబీ రేకులు, కుంకుమపువ్వు వేసి మరోసారి మిక్స్ చేయాలి. ఈ మిశ్రమం సువాసనతో కూడిన మసాలాగా తయారవుతుంది. పూర్తిగా చల్లారిన తరువాత గాలి చొరబడని సీసాలో నిల్వచేస్తే ఎక్కువ రోజుల పాటు తాజాగా ఉంటుంది.

## చల్లని పాలలో కలిపి..

ఈ మసాలాతో తండాయి తయారు చేయడం కూడా చాలా ఈజీ. చల్లని పాలలో ఒకటి లేదా రెండు టీస్పూన్లు మసాలా కలిపి, అవసరమైతే చక్కెర వేసి బాగా కలిపి సర్వ్ చేస్తే చాలు. ఇది శరీరాన్ని లోపల నుంచి చల్లబరచడంలో సహాయపడుతుంది. ఇంట్లో తయారు చేసిన తండాయి మసాలా సహజమైన రుచితో పాటు ఆరోగ్య ప్రయోజనాలను కూడా అందిస్తుంది. అయితే ఇది తీపి ఎక్కువగా ఉండే పానీయం కాబట్టి మితంగా తీసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

## ప్రపంచం మెచ్చిన నాయకుడు ప్రధాని నరేంద్ర మోడీ



అవనిగడ్డ ఆగస్టు 20 శ్రీ వార్త : భారత ప్రధానిగా నరేంద్ర మోదీ గత 12 సంవత్సరాలుగా ప్రజా మద్దతుతో ప్రజల మనస్సు గెలవడమే కాకుండా ప్రపంచ దేశాలతో సత్సంబంధాలుతో మెలుగుచూ ప్రపంచ గుర్తింపు పొందిన మహా నాయకుడు మన ప్రధాని నరేంద్ర మోడీ, అలాంటి నాయకత్వాన్ని విమర్శిస్తూ అవనిగడ్డ నియోజకవర్గం అవనిగడ్డ లో ఒక వై సి పి నేత నని చెప్పుకుంటూ కూటమి ప్రభుత్వాన్ని విమర్శించడం విడ్డూరంగా ఉందని బీజేపీ అవనిగడ్డ మండల పార్టీ అధ్యక్షుడు శోభిలు ఏడుకొండలు అన్నారు, గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గతం లో మీ ప్రభుత్వ హయాం లో ఓటు రాజకీయం కోసం ఫాస్టర్ లకు ముల్లాలకు జీతాలు ఇస్తూ విభజించి పాలించు అనే రీతిలోప్రజా సంబంధాలు విడదీసింది వై సి పి ప్రభుత్వం కదా? వై సి పి ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం ఎన్నో వేల కోట్ల నిధులు ప్రజాభి వృద్ధి కోసం ఇచ్చారు,ఆ నిధులు ఏమయ్యాయో మీ అధిష్టానాన్ని అడిగి తెలుసుకోవాలన్నారు, ఒక ప్రధానిగా కూటమి నేతగా నరేంద్ర మోడీ ఆర్టికల్ 370రద్దు,ఆడపడుచుల ఆత్మ గౌరవం కోసం ట్రిపుల్ తలాక్ రద్దు లాంటి అనేక ప్రజోపయోగ కార్యక్రమాలు చేస్తూ ఎప్పుడూ లేనంతగా అభివృద్ధి భారత దేశంలో ఈ 12 సంవత్సరాలలోనే జరిగింది .జగమెరిగిన సత్యం,ఆంధ్రుల కలలు నెరవేరుస్తూ విశాఖ రైల్వే జోన్ ఏర్పాటు,ఎప్పుడూ జరగని రైల్వే అభివృద్ధి ఈ 12 సంవత్స రాలలో రైల్వే స్టేషన్ ల అభివృద్ధి,వేల కిలో మీటర్లు జాతీయ రహదారుల విస్తరణ, రక్షణరంగ అభివృద్ధి చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదే, రైతుల కోసం రైతు భరోసా 6000/పెట్టుబడి సాయం,రైతుల కోసం వేల కోట్లు ఎరువుల సబ్సిడీ, మేక్ ఇన్ ఇండియా గా భారత్ ను అభివృద్ధి చేస్తూ 2047 నాటికి వికాసిత్ భారత్ గా రూపుదిద్దుతున్న నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని సమర్థిస్తూ పార్లమెంటు లో ప్రవేశ పెట్టిన ప్రతి బిల్లు కి మద్దతు పలికిన మీ నాయకుడిని అడిగితే బీజేపీ చేసే అభి వృద్ధి ఏమిటో తెలుస్తుంది, విమర్శలు మానుకొని భారతీయ జనతా పార్టీ అంటే ఏమిటో తెలుసుకొని మాట్లాడాలని ఏడు కొండలు హితవు పలికారు. ఈ కార్యక్రమంలో కిషన్ మోర్చా మండల ఉపాధ్యక్షుడు పడమటి సుబ్రహ్మణ్యం ఉన్నారు,

## అక్రమ తోలకాలను అడ్డుకున్న రెవిన్యూ సిబ్బంది



అవనిగడ్డ ఆగస్టు 20 శ్రీ వార్త: అవనిగడ్డ శివారు అశ్వరావు పాలెం సమీపంలో అక్రమంగా తరలిస్తున్న మట్టి ట్రాక్టర్ ను రెవిన్యూ సిబ్బంది అడ్డుకున్నారు. గురువారం ఉదయం కోడూరు మండలం మందపాకల గ్రామం నుండి మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లను సమాచారం అందుకున్న రెవెన్యూ సిబ్బంది ఆర్ఐ బాలాజీ ఆధ్వర్యంలో వీఆర్వో వీఆర్ఏ లు వెళ్లి అడ్డుకొని కోడూరు రెవిన్యూ కార్యాలయంలో రెండు డాక్టర్లను అప్పగించారు. మట్టి మాఫియా మాత్రం మనల్ని ఎవడ్రా ఆపేది అంటూ చెలరేగిపోతూనే ఉన్నారు. అక్రమంగా మట్టి తరలిస్తున్న ఎటువంటి ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని తాసిల్దార్ బి అంకాలు హెచ్చరించారు,

## 23వ తేదీన ఆయుర్వేద వైద్య శిబిరం

అవనిగడ్డ ఆగస్టు 20 శ్రీ వార్త : ఈనెల 23వ తేదీ ఆదివారం భారతీయ వైద్య విధానం అయిన ఆయుర్వేద వైద్య శిబిరం ఇండియన్ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ గరికిపాటి హరిప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరంలో ఆసక్తి ఉన్నవారు తమ పేర్లను ముందుగా నమోదు చేయించుకోవాలని కిడ్నీ సమస్యతో చనిపోయిన వారి సంఖ్య క్రమంగా పెరుగుతుందని కిడ్నీ ఫెయిల్యూర్ కారణాలను అన్వేషించి ప్రజలను రక్షించే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రపంచంలో అనేక వైద్య విధానాలు అందుబాటులో ఉన్నప్పటికీని వాటిలో కొన్ని అలోపతి .ఆయుర్వేదం. హోమియోపతి. యూనాని. సిద్ధ. మూలిక. యోగా. ప్రకృతి వైద్యం. మానవుని ఆరోగ్య రక్షణలో దీని ప్రత్యేకత దానికే ఉందన్నారు. విజయవాడలోని గాయత్రి ఆయుర్వేద వైద్య శిబిరం ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమం మండల రెవెన్యూ సమావేశ మందిరంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు,

## కొల్లు ఫౌండేషన్ ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు

### శిక్షణ కోసం బెంగళూరుకు తరలి వెళ్లిన 15 మంది యువకులు




మచిలీపట్నం శ్రీవార్త న్యూస్ : యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కొల్లు ఫౌండేషన్ కృషి చేస్తోంది.కృష్ణాజిల్లా మచిలీపట్నంలో కొల్లు ఫౌండేషన్, బిఎస్ వీటి (భారత్ స్కూల్ ఆఫ్ వర్టికల్ ట్రాన్స్ పోర్టేషన్) ఆధ్వర్యంలో ఇటీవల స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రాం నిర్వహించారు. దానిలో భాగంగా జరిగిన ఇంటర్వ్యూలో సెలెక్ట్ అయిన యువతకు బెంగళూరులో శిక్షణ ఇస్తారు.ఈ శిక్షణ కోసం 15 మంది యువకులు మచిలీపట్నం నుంచి బెంగళూరు తరలి వెళ్లారు.ఈ కార్యక్రమాన్ని కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గొర్రిపాటి గోపీచంద్ ప్రారంభించారు. పార్టీ నగర అధ్యక్షులు లోగిశెట్టి వెంకటస్వామి తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోపీచంద్, లోగిశెట్టి స్వామి మాట్లాడుతూ,కొల్లు ఫౌండేషన్ బి ఎస్ వీ టి ద్వారా సెలక్ట్ అయిన యువతకు బెంగళూరులో 30 రోజులపాటు శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. ఇందుకోసం సెలెక్ట్ అయిన యువతను మంత్రి కొల్లు రవీంద్ర తన సొంత ఖర్చులతో బెంగళూరుకు పంపుతున్నారన్నారు. మచిలీపట్నం అభివృద్ధితో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే దృఢ సంకల్పంతో పనిచేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర పనితనానికి ఇదొక నిదర్శనమన్నారు.

## శ్రీవారి బ్రహ్మోత్సవాలపై టిటిడి ఉన్నతస్థాయి సమీక్ష

### కలియుగ దైవం బ్రహ్మాండనాయకుడైన శ్రీమన్నారాయణుడు, వార్షిక బ్రహ్మోత్సవాలు,సాలకట్ల బ్రహ్మోత్సవాల,వేడుకలకు సిద్ధం



తిరుమల ఆగస్టు/20 శ్రీ వార్త: తిరుమల శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల ముందస్తు ఏర్పాట్లపై టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర నేతృత్వంలో అన్నమయ్య భవనములో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం జరిగినది. ఈ భేటీకి జిల్లా కలెక్టర్ ఎస్పీతో పాటు టీటీడీ అదనపు ఈవో జేఈవోలు మరియు ఇతర ఉన్న అధికారులు హాజరయ్యారు సెప్టెంబర్ 15 నుండి 23వ తేదీ వరకు సాలకట్ల బ్రహ్మోత్సవాలు అక్టోబర్ 11 నుండి 20వ తేదీ వరకు నవరాత్రి మహోత్సవాలు జరుగును నేపథ్యంలో భక్తుల రద్దీ నియంత్రణ ఉత్సవాల నిర్వహణ కట్టుదిట్టమైన భద్రతా మరియు ట్రాఫిక్ మళ్లింపు వంటి ముఖ్యాంశాలపై చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు కావున,ఆబ్రహ్మాండనాయకుని, దర్శనముకోసం, వచ్చేటటు వంటియావన్మంది ,భక్తులు సహకరించ వలసిందిగా టిటిడి దేవస్థానం అధికారులు విన్నవించినారు.

# భారత ఉపరాష్ట్రపతి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి



### ... కృష్ణాజిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎం. నవీన్

గన్నవరం శ్రీ వార్త న్యూస్: ఈ నెల 24వ తేదీన భారత ఉపరాష్ట్రపతి విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయానికి రానున్న నేపథ్యంలో పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని కృష్ణాజిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎం. నవీన్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయములోని విశిష్ట అతిథుల భవన సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడుతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో ఉపరాష్ట్రపతి పర్యటన ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపరాష్ట్రపతి ఏలూరు జిల్లాలో జరిగే కార్యక్రమంలో పాల్గొననున్నందున, గన్నవరం విమానాశ్రయంలో స్వాగతం, తిరుగు ప్రయాణ కార్యక్రమాలకు అవసరమైన అన్ని ఏర్పాట్లను సమన్వయంతో చేపట్టాలని తెలిపారు. పర్యటన ఏర్పాట్లకు ఆర్డీఓ గుడివాడను ఓవరాల్ ఇన్‌చార్జిగా నియమించి, అన్ని శాఖల అధికారులు ఆయనతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.వీఐపీ రిసెప్షన్, గ్రీన్ రూమ్‌లు, పార్కింగ్, అల్పాహారం, వైద్య సదుపాయాలు తదితర ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని తెలిపారు. ఉపరాష్ట్రపతికి అందించే ఆహారం, అల్పాహారం నాణ్యతను ఫుడ్ సేఫ్టీ అధికారులు పర్యవేక్షించాలని, అవసరమైన నమూనాలను సేకరించి పరీక్షించాలని ఆదేశించారు. వైద్యపరంగా అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే స్పందించేలా డీఎంహెచ్ఓ, డీసీహెచ్ఎస్, జీజీహెచ్, ఏపీవీవీపీ అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. అత్యవసర వైద్య పరికరాలు, వైద్య నిపుణులను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు మాట్లాడుతూలి ఉపరాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో విమానాశ్రయం నుంచి ఏలూరు జిల్లా ముసునూరు వరకు భద్రతా చర్యలను పటిష్టంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ఉపరాష్ట్రపతి కాన్వాయ్‌ను ఏలూరు జిల్లా నుంచి ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో కృష్ణాజిల్లా పరిధిలో అవసరమైన పైలట్ వాహనాలను సమన్వయం చేయాలని తెలిపారు. విమానాశ్రయం నుంచి గమ్యస్థానం వరకు మొత్తం రూట్‌ను మరోసారి క్షుణ్ణంగా పరిశీలించి, ముఖ్యమైన రూట్ పాయింట్లను గుర్తించాలని సూచించారు.విమానాశ్రయంలోని కొత్త టెర్మినల్‌తో పాటు అన్ని కీలక ప్రాంతాలను భద్రతా పరిధిలోకి తీసుకురావాలని తెలిపారు. విమానాశ్రయం, పార్కింగ్ ప్రాంతాలు, మొత్తం ప్రయాణ మార్గంలో బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్, వీడియో బృందాలను అవసరమైన విధంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పార్కింగ్ ప్రాంతాల్లోకి వచ్చే వాహనాలను పూర్తిస్థాయిలో తనిఖీ చేసిన అనంతరం మాత్రమే అనుమతించాలని, అనధికారిక వాహనాలు, జనసమూహాలను ప్రధాన మార్గం వద్దనే నియంత్రించాలని స్పష్టం చేశారు.ట్రాఫిక్ నిర్వహణలో భాగంగా జాతీయ రహదారిపై ముఖ్యమైన జంక్షన్లు, ఫ్లైఓవర్ల కింద ఉన్న జాయినింగ్ పాయింట్లను గుర్తించి బారికేడింగ్ ఏర్పాటు చేయాలని తెలిపారు. కాన్వాయ్ మార్గంలో వాహనాలు అకస్మాత్తుగా ప్రవేశించకుండా ట్రాఫిక్ సిబ్బందిని ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో ఇంచార్జ్ ఎయిర్పోర్ట్ డైరెక్టర్ ఏకే దేశ్వాల్, విమానాశ్రయ సీఎస్‌వో కె. ధర్మేంద్ర, డిప్యూటీ కలెక్టర్ ఎస్ పోతురాజు, గుడివాడ ఆర్డీఓ జి బాలసుబ్రమణ్యం, గన్నవరం తహసిల్దార్ శివయ్య, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, స్పెషల్ బ్రాంచ్ సిఐ వై సత్య కిషోర్, తదితరులు పాల్గొన్నారు.





# కలెక్టర్‌పై సమగ్ర విచారణ జరిపించాలి

### కమిషన్ చైర్మన్ బక్కా వెంకటయ్యకు ఎల్‌హెచ్‌పీఎస్, మాదిగ హక్కుల దండోరా నాయకుల ఫిర్యాదు



**మహబూబాబాద్, ఆగస్టు 20 :** ప్రజా సమస్యలపై జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రాలు సమర్పించేందుకు వచ్చే అర్జీదారుల పట్ల దురుసుగా వ్యవహరిస్తూ, వారి అర్జీలను స్వీకరించకుండా నిరాకరిస్తున్నారంటూ లంబాడి హక్కుల పోరాట సమితి, మాదిగ హక్కుల దండోరా నాయకులు ఆరోపించారు. ఈ విషయంపై జోక్యం చేసుకుని సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ గురువారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కా వెంకటయ్యకు రాతపూర్వకంగా వినతిపత్రం అందజేశారు. ప్రజలు తమ సమస్యలను చెప్పుకునేందుకు కలెక్టరేట్‌కు వచ్చినప్పుడు వారిని భయపెట్టే విధంగా మాట్లాడటం, వారి విజ్ఞాపనలను సరిగా వినకుండా అర్జీలను తిరస్కరించడం వంటి చర్యలు ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయని నాయకులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై స్పందించాల్సిన అధికారులు అర్జీదారులతో మర్యాదగా వ్యవహరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

డీసీఓ సరెండర్‌పై అభ్యంతరం

బయ్యారం పీఏసీఎస్ ఎన్నికల వ్యవహారంలో నిబంధనలకు అనుగుణంగా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసిన జిల్లా డీసీఓ విజయకుమారిని కలెక్టర్ సరెండర్ చేయడం బాధాకరమని నాయకులు పేర్కొన్నారు. కోర్టు ఆదేశాల నేపథ్యంలో బయ్యారం సొసైటీ చైర్మన్ పదవి రద్దైన అనంతరం కొత్త చైర్మన్ ఎన్నిక నిర్వహణలో డీసీఓ నిజాయితీగా, రాజ్యాంగబద్ధంగా వ్యవహరించారని తెలిపారు. అనేక ఒత్తిళ్లను ఎదుర్కొంటూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసిన అధికారిని సరెండర్ చేయడం వల్ల ఉద్యోగుల్లో మనోధైర్యం దెబ్బతింటుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టరేట్‌లో డీసీఓపై దాడి జరిగిన సమయంలో ఆమెకు తగిన రక్షణ కల్పించలేదని ఆరోపిస్తూ, జిల్లాలో విధులు నిర్వహిస్తున్న అధికారులకు రక్షణ ఎవరు కల్పిస్తారని ప్రశ్నించారు. జిల్లాలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులపై ఫిర్యాదులు చేసినప్పటికీ చర్యలు తీసుకోకుండా, నిజాయితీగా పనిచేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవడం పక్షపాత ధోరణికి నిదర్శనమని వారు ఆరోపించారు. ఈ వ్యవహారంపై కలెక్టర్ చర్యలను సమగ్రంగా విచారించాలని కమిషన్ చైర్మన్‌ను కోరారు.

**కలెక్టర్, ఎస్పీ బదిలీకి డిమాండ్..,**

ఒకే జిల్లాలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ భార్యాభర్తలుగా పనిచేయడం వల్ల ప్రజల్లో భయాందోళనలు నెలకొంటున్నాయని నాయకులు పేర్కొన్నారు. ఇద్దరిలో ఒకరిని ఇతర జిల్లాకు బదిలీ చేయాలని కమిషన్ చైర్మన్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎల్‌హెచ్‌పీఎస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి బోడా లక్ష్మణ్ నాయక్, మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర కార్యదర్శి దర్శనం రామకృష్ణ మాట్లాడుతూ.. నిజాయితీగా విధులు నిర్వహించిన దళిత అధికారి డీసీఓ విజయకుమారిని ఆదర్శంగా తీసుకోవాల్సింది పోయి సరెండర్ చేయడం విచారకరమన్నారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిబంధనల ప్రకారం ఎన్నికలు నిర్వహించిన అధికారిపై చర్యలు తీసుకోవడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా నాయకులు అంగోత్ సుధాకర్, బానోత్ లక్ష్మణ్, బయ్యారం పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మన్ గంగుల సత్యనారాయణ, మాజీ డైరెక్టర్ ఎనుగుల ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులపై పోలీసుల దాడిని ఖండించిన ఎల్‌హెచ్‌పీఎస్ నేతలు

### రేపు ఉదయం 10 గంటల్లోపు క్షమాపణలు చెప్పాలి

### లేదంటే పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా : గుగులోతు భీమా నాయక్



**మహబూబాబాద్, ఆగస్టు 20 :** తమ సమస్యల పరిష్కారం కోసం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చిన విద్యార్థులపై పోలీసులు దాడి చేయడాన్ని లంబాడీ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) నేతలు తీవ్రంగా ఖండించారు. విద్యార్థులపై దాడికి బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గుగులోతు భీమా నాయక్ మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన విద్యార్థులపై పోలీసులు దాడి చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని ఒక్క మాట చెప్పి ఉంటే ఈ పరిస్థితి తలెత్తేది కాదన్నారు. న్యూసెన్స్‌కు కారణం పోలీసుల తీరేనని ఆయన విమర్శించారు. జిల్లా పరిపాలన, పోలీసు వ్యవస్థ తమ చేతుల్లో ఉందని భావిస్తే రాజ్యాంగం అంగీకరించదని, "ఏం చేసినా నడుస్తుంది అనుకుంటే కుదరదు" అని భీమా నాయక్ హెచ్చరించారు. విద్యార్థులు వినతిపత్రం సమర్పించేందుకు వస్తే కనీసం వారి సమస్యలు వినేందుకు జిల్లా కలెక్టర్‌కు సమయం లేదా అని ప్రశ్నించారు. "పోలీసులకు ఒక్కటే చెబుతున్నాం.. రేపు ఉదయం 10 గంటలలోపు విద్యార్థులకు క్షమాపణలు చెప్పాలి. లేదంటే అదే విద్యార్థులతో పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహిస్తాం" అని భీమా నాయక్ స్పష్టం చేశారు. విద్యార్థులపై జరిగిన దాడిని ఎల్‌హెచ్‌పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి గుగులోతు హరి నాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బోడ లక్ష్మణ్ నాయక్, అడ్వకేట్ మోహన్ నాయక్, మహిళా సంఘం నాయకురాలు స్వర్ణలత తదితరులు ఖండించారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, ఘటనకు బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

## మరిపెడలో ఘనంగా మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు



**మరిపెడ,ఆగస్టు 20:** పట్టణంలో స్వర్గీయ మాజీ ప్రధాని,భారతరత్న రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకుని మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కాంగ్రెస్ నాయకులు ఒంటికొమ్ము యుగంధర్ రెడ్డి,మున్సిపల్ చైర్ పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..దేశానికి రాజీవ్ గాంధీ చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు.ఆధునిక భారత నిర్మాణంలో,పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం,యువతకు ఓటు హక్కు కల్పనలో రాజీవ్ గాంధీ పాత్ర చిరస్మరణీయమని అన్నారు.ఆయన ఆశయాలను కొనసాగించేందుకు కాంగ్రెస్ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో మండల పార్టీ అధ్యక్షుడు గుగులోత్ రవి నాయక్,టౌన్ ప్రెసిడెంట్ పానుగోతు రాంలాల్,కే సముద్రం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఐలమల్లు,మున్సిపల్ వైస్ చైర్మన్ కాలం సునీత రవీందర్ రెడ్డి,డీసీసీ సభ్యుడు కుడితి నర్సింహా రెడ్డి,కౌన్సిలర్లు జాటోత్ సురేష్,మెరుగు రాము,జియో రమేష్,నీలా లచ్చిరామ్,కాంతమ్మ కరణ్ సింగ్,పానుగోతు రాములు,కో-ఆప్షన్ సభ్యులు గుండగాని వెంకన్న,షేక్ సలీమా తాజోద్దీన్,సర్పంచులు పెండ్లి శ్రీనివాస్ రెడ్డి,తొట్టి గౌతమ్,బద్రు,నరేందర్ తో పాటు కాంగ్రెస్ పార్టీ వార్డు అధ్యక్షులు,సీనియర్ నాయకులు,యువజన నాయకులు,మహిళా నాయకురాళ్లు,పార్టీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు...

# రేర్ ఎర్త్ మినరల్స్‌కు కేరాఫ్ అడ్రస్‌గా ఏపీని మారుస్తాం

## పర్మినెంట్ మేగ్నెట్స్ స్థానికంగానే తయారీకి చర్యలు - మంత్రి కొల్లు రవీంద్ర



అమరావతి శ్రీ వార్త న్యూస్: రాష్ట్రంలో రేర్ ఎర్త్ మినరల్స్ నిక్షేపాలు సమృద్ధిగా ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుని దేశ మైనింగ్ రంగంలో ఏపీని అగ్రస్థానంలో నిలుపుతామని రాష్ట్ర గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి లికొల్లు రవీంద్ర అన్నారు.అటామిక్ ఎనర్జీ మాజీ శాస్త్రవేత్త ఆచార్య యుగంధర్ రావు బృందం సచివాలయంలో మంత్రిని కలిసి ప్రతిపాదనలు అందించారు. విమానాలు, ఈవీ వాహనాలు, రక్షణ రంగ వాహనాల తయారీకి వినియోగించే సూపర్ మెటల్ మినరల్స్ వెలికితీతకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. రాష్ట్ర సముద్ర తీరంలో ఇల్లిమనైట్, రూటాయిల్, జిర్కాన్, గార్నెట్, సిలిమినైట్, మోనజైట్ వంటి ఖనిజాలు అపారంగా ఉన్నాయని తెలిపారు. వెలికితీతకు ప్రైవేట్ పెట్టుబడులు అవసరమని, టెక్నాలజీ ప్రాసెసింగ్‌లో చైనా, జపాన్, ఆస్ట్రేలియా ముందున్నాయని వివరించారు.



రేర్ ఎర్త్ మినరల్స్, పర్మినెంట్ మేగ్నెట్స్ పై యూనివర్శిటీల్లో ప్రత్యేక కోర్సులు ప్రారంభించాలని ప్రతిపాదించారు. నేషనల్ క్రిటికల్ మినరల్ పాలసీ 2026 ద్వారా కేంద్రం కూడా తోడ్పాటు అందిస్తోందన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర స్పందిస్తూ, ఈ అంశాలన్నింటినీ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని, స్థానికంగానే రేర్ ఎర్త్ మినరల్స్, పర్మినెంట్ మేగ్నెట్స్ కోసం ప్రత్యేక కోర్సులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. త్వరలో ఐఆర్ఈఎల్ కేంద్రాన్ని కూడా పరిశీలిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సైన్స్ అండ్ టెక్నాలజీ సెక్రటరీ డా. హెచ్. పురుషోత్తం ప్రొ. వేణుబాబులి పాల్గొన్నారు.

# కేబ్రాహ్మణుల కోసం చంద్రబాబు వేసిన అడుగు దేవుడి దీవెనగా మారింది

## రూ.25 కోట్లతో ప్రారంభమైన క్రెడిట్ సొసైటీ నేడు రూ.270 కోట్ల టర్నోవర్ కు చేరుకుంది



మచిలీపట్నం శ్రీవార్త న్యూస్ : బ్రాహ్మణుల ఆర్థిక స్వావలంబన కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడ దూరదృష్టితో ఏర్పాటైన ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ 12వ వార్షికోత్సవం మచిలీపట్నంలో ఘనంగా జరిగింది.బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ పి.వి. ఫణి కుమార్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. తెలుగుదేశం సీనియర్ నాయకుడు, కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్ ముఖ్య అతిథిగా పాల్గొని, వశిష్ట గ్రూపు కింద రూ.2.25 లక్షల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా గొర్రెపాటి గోపీచంద్



మాట్లాడుతూ, "12 ఏళ్ల క్రితం రూ.25 కోట్లతో ప్రారంభమైన సొసైటీ నేడు రూ.270 కోట్ల టర్నోవర్ స్థాయికి చేరుకోవడం చంద్రబాబు దూరదృష్టికి నిదర్శనం. ఇది బ్రాహ్మణులు తమ కాళ్లపై తాము నిలబడాలనే ఆయన సంకల్పానికి సాక్ష్యం" అన్నారు. బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ పి.వి. ఫణి కుమార్ మాట్లాడుతూ, ప్రస్తుతం సొసైటీకి 82,000 మంది సభ్యులు, రూ.77 కోట్ల డిపాజిట్లు, ఐఐఐ రూ.112 కోట్ల రుణాలు ఉన్నాయని తెలిపారు. రూ.600 సభ్యత్వంతో 18 నుంచి 60 ఏళ్ల వయస్సు గల వారికి సహజ మరణంపై రూ.50,000 ఆర్థిక సహాయం అందించే సంక్షేమ ప్రయోజనం ఉందని వివరించారు. ప్రతి బ్రాహ్మణ కుటుంబం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో బ్రాహ్మణ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ విజయవాడ బ్రాంచ్ మేనేజర్ గోర్తి శ్రీనివాస్ రామలింగేశ్వర స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు మెంబర్ నిమ్మగడ్డ శ్రీధర్ బ్రాహ్మణ సేవా సంఘం ప్రధాన కార్యదర్శి కానుకొలను ఫణి కిరణ్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్ గాంధీ 82వ జయంతి వేడుకలు

## ఐటీ, సాంకేతిక రంగాల్లో దేశాన్ని ముందు నడిపిన ఘనత రాజీవ్ గాంధీదే



మచిలీపట్నం శ్రీవార్త న్యూస్ : కృష్ణాజిల్లా కాంగ్రెస్ పార్టీ ఆఫీసులో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 82వ జయంతి కార్యక్రమాన్ని జిల్లా అధ్యక్షులు అందే శ్రీరామ్ మూర్తి ఆదేశాల మేరకు నిర్వహించారు. జిల్లా జనరల్ సెక్రటరీ కొడమంచి లీలా చంద్రశేఖర్ రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ, భారతదేశంలో ఐటీ మరియు సాంకేతిక రంగాలను అభివృద్ధి చేసిన ఘనత రాజీవ్ గాంధీదేనని, యువతకు ఓటు హక్కును 21 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాలకు తగ్గించిన ఘనత కూడా ఆయనదేనని పేర్కొన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రతి కాంగ్రెస్ కార్యకర్త పని చేస్తారని తెలిపారు. పిసి డెలిగేట్ నల్లబోలు కుమారి మాట్లాడుతూ, 73, 74వ రాజ్యాంగ సవరణల ద్వారా చట్టసభలలో మహిళలకు, యువతకు ప్రాధాన్యత కల్పించారని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు చిలుకోటి ప్రసాద్, కిసాన్ సెల్ నాయకులు శంకర్, పొట్లూరి అమ్మాజీ, కాంగ్రెస్ నాయకులు గోవిందరాజులు, శీను, పులిపాక జ్యోతి, యూత్ కాంగ్రెస్ నాయకులు లోకేష్, నల్లబోలు శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, గృహ వసతి కల్పించాలి

## ఎమ్మెల్యే గళ్ళా మాధవి



అమరావతి శ్రీ వార్త న్యూస్: రాష్ట్రంలోని అక్రిడిటేషన్ కలిగిన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు లేదా గృహ వసతి కల్పించాలని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రభుత్వాన్ని కోరారు. అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లో జీరో అవర్‌లో జర్నలిస్టుల సమస్యలను ఆమె సభ దృష్టికి తీసుకువచ్చారు. ప్రజాస్వామ్యానికి నాలుగో స్థంభంగా జర్నలిస్టులు పనిచేస్తున్నారని, ప్రజా సమస్యలు, సామాజిక అంశాలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని గళ్ళా మాధవి అన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా జర్నలిస్టుల్లో ఎక్కువ మంది పరిమిత వేతనాలతో పనిచేస్తున్నారని, సొంత ఇల్లు నిర్మించుకోవడం వారికి పెద్ద సమస్యగా మారిందని చెప్పారు. జర్నలిస్టులకు నిర్దిష్టమైన పని వేళలు లేకపోవడం, వృత్తిపరమైన ఒత్తిళ్లు కూడా వారి కుటుంబ జీవితంపై ప్రభావం చూపుతున్నాయని ఆమె పేర్కొన్నారు. ప్రభుత్వం అందించే ఆరోగ్య కార్డులు, గృహ వసతి వంటి సదుపాయాలు జర్నలిస్టులకు, వారి కుటుంబాలకు సామాజిక భద్రత కల్పిస్తాయని అన్నారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ వంటి ప్రాంతాల్లో జర్నలిస్టుల కోసం కాలనీలు ఏర్పాటు చేసిన విషయాన్ని ఎమ్మెల్యే గుర్తుచేశారు. అదే విధంగా విభజిత ఆంధ్రప్రదేశ్‌లోనూ జర్నలిస్టులకు గృహ వసతి కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, గృహ వసతి కల్పించాలనే ఉద్దేశంతో గతంలో జి.ఓ. నంబర్ 67, 107లను ప్రభుత్వం జారీ చేసిందని గళ్ళా మాధవి తెలిపారు. ఆ ఉత్తర్వులను అమలు చేస్తూ రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో అక్రిడిటేషన్ కలిగిన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు లేదా గృహ వసతి కల్పించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును అసెంబ్లీ వేదికగా కోరారు. జర్నలిస్టుల సంక్షేమానికి ప్రత్యేక దృష్టి సారించి, అర్హులైన ప్రతి జర్నలిస్టుకు పారదర్శకంగా గృహ వసతి కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

# క్యాన్సర్ బాధిత కుటుంబానికి "స్ఫూర్తి ఫౌండేషన్ "చేయూత




మచిలీపట్నం శ్రీవార్త న్యూస్: పెరిగిపోతున్న క్యాన్సర్ రోగుల సంఖ్యను బట్టి వారిని ఆదుకోవడానికి రాష్ట్రంలో ప్రత్యేక ఉచిత క్యాన్సర్ నివారణ ఆస్పత్రులను ఏర్పాటు చేయాలని మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు సీనియర్ న్యాయవాది లంకిశెట్టి బాలాజీ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గురువారం మచిలీపట్నం డ్రైవర్స్ కాలనీలో దీర్ఘ కాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నా నిరుపేద కుటుంబానికి గురువారం స్ఫూర్తి ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాట్లాడుతున్న బాలాజీ మాట్లాడుతూ క్యారీ కవర్ల నివారణ పర్యావరణ పరిరక్షణ చేయడంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని క్యాన్సర్ మహమ్మారిని తరిమికొట్టాలని బాలాజీ అన్నారు. 40 సంవత్సరాలు దాటిన మహిళలు క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో



గూడూరు మండలం మల్లవోలు గ్రామానికి చెందిన క్యాన్సర్ బాధితుడు శ్రీ తలారి రామకృష్ణ(35) వారి కుటుంబానికి మచిలీపట్నం డ్రైవర్స్ కాలనీలో మానవతా దృక్పథంతో చేయూత అందించారు. గత కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో తీవ్ర అనారోగ్యానికి గురైన తలారి రామకృష్ణ మంచానికే పరిమితమయ్యారు. దాదాపు రెండేళ్లుగా ఉపాధి కోల్పోవడంతో కుటుంబ ఆర్థిక పరిస్థితి తీవ్రంగా దయనీయంగా మారింది. ఆయన సతీమణి పలు ఇళ్లలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించడంతో పాటు, తమ ఇద్దరు కుమార్తెల విద్యాభ్యాసాన్ని కొనసాగించేందుకు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ కుటుంబ పరిస్థితిని ప్రత్యక్షంగా తెలుసుకున్న స్ఫూర్తి ఫౌండేషన్ కమిటీ సభ్యులు, వారికి అవసరమైన సహాయం అందించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా వానపల్లి నాగరాజు గారు, మాధవీలత గారి కుటుంబం సహకారంతో రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులను బాధిత కుటుంబానికి అందించారు. అదేవిధంగా, మచిలీపట్నం ప్రముఖ న్యాయవాది లంకిశెట్టి బాలాజీ గారు రూ.3,000/- ఆర్థిక సహాయం అందించారు. మల్లవోలు గ్రామానికి చెందిన తలారి రామకృష్ణ గారి స్నేహితులు, గ్రామస్తులు కలిసి రూ.11,000/- ఆర్థిక సహాయం అందించారు. ఈ విధంగా బాధిత కుటుంబానికి మొత్తం రూ.14,000/- ఆర్థిక సహాయంతో పాటు రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు అందించడం జరిగింది. ఈ సందర్భంగా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ, ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడం, అవసరమైన వారికి తోడ్పాటు అందించడం తమ ఫౌండేషన్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ సేవా కార్యక్రమానికి సహకరించిన దాతలు, గ్రామస్తులు, స్నేహితులకు స్ఫూర్తి ఫౌండేషన్ తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గూడురు మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గోపి నాగబాబు అర్చపల్లి సొసైటీ మాజీ సీఈవో మల్లంపల్లి వీర వెంకట రామాంజనేయులు బాబు తదితరులు పాల్గొన్నారు

# వరలక్ష్మి వ్రతంతో ఇంటిల్లిపాదికి సుఖ సంతోషాలు

## భక్తి శ్రద్ధలతో మహిళలు చేసే పూజలకు ప్రత్యేక ప్రాధాన్యత



కృష్ణాజిల్లా శ్రీ వార్త న్యూస్ : స్త్రీలకు అత్యంత పవిత్రమైన పండుగలలో వరలక్ష్మి వ్రతం ఒకటి. శ్రావణ మాసం రెండవ శుక్రవారం ఈ వ్రతాన్ని ఆచరిస్తారు. ముత్తైదువులు తమ సౌభాగ్యం కోసం, కుటుంబ సభ్యుల సుఖ సంతోషాల కోసం ఈ పూజను భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తారు. పురాణ కథ ప్రకారం మగధ దేశంలో చారుమతి అనే మహిళకు కలలో మహాలక్ష్మి కనిపించి వరలక్ష్మి వ్రతం చేయమని ఆదేశించింది. ఆమె చెప్పిన విధంగా పూజ చేసిన తర్వాత చారుమతి ఇంట సకల సంపదలు చేకూరాయని, అప్పటి నుంచి ఈ వ్రతం ఆచారంగా వస్తోందని ప్రతీతి. మహిళలు ఉదయాన్నే తలస్నానం చేసి, ఇల్లు శుభ్రం చేసి ముగ్గులు వేస్తారు. కలశం ఏర్పాటు చేసి లక్ష్మీదేవి ఫోటో లేదా విగ్రహాన్ని ప్రతిష్టించి పూజిస్తారు. పసుపు, కుంకుమ, పూలు, పండ్లు, తాంబూలం, పాయసం నైవేద్యంగా సమర్పిస్తారు. వ్రత కథ విని, తోటి మహిళలకు తాంబూలం, గాజులు, పసుపు కుంకుమ ఇచ్చి సత్కరిస్తారు.వరలక్ష్మి అంటే వరాలను ఇచ్చే లక్ష్మి అని అర్థం. ఈ వ్రతం చేయడం వల్ల అష్టైశ్వర్యాలు, సంతాన సౌభాగ్యం, ఆరోగ్యం, ఐశ్వర్యం కలుగుతాయని భక్తుల నమ్మకం. కుటుంబంలోని మహిళలందరూ కలిసి పూజ చేయడం వల్ల అనుబంధాలు మరింత బలపడతాయి. ఈ శ్రావణ మాసంలో ప్రతి ఇంట వరలక్ష్మి వ్రత వేడుకలు భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్నాయి.

# దోమల నిర్మూలనతోనే వ్యాధుల నివారణ....

## వైద్యాధికారి వెంకటేశ్వర్లు

పత్తికొండ టౌన్ వర్షం న్యూస్ బ్యూరో ఆగష్టు 20: పత్తికొండ :దోమల నిర్మూలనతోనే వ్యాధులను నివారించవచ్చని వైద్యాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రపంచ దోమల దినోత్సవాన్ని పురస్కరించుకొని పత్తికొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి తేరు బజారు వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యులు సాయిబాబా, ప్రకాశ్, వీరేశప్ప, మెడికల్ ట్రైనింగ్ విద్యార్థులు, ఏఎన్ఎం, ఆశాలు పాల్గొన్నారు.

# పత్తికొండలో "సబ్ కోర్టు" ఏర్పాటు చేయాల్సిందే

## కాలినడకతో న్యాయవాదుల నిరసన....

పత్తికొండ / రిపోర్టర్ ఆగస్టు..20: రాష్ట్ర ప్రభుత్వం కర్నూలులో శాశ్వత హైకోర్టు బెంచ్ తో పాటు డివిజన్ కేంద్రమైన పత్తికొండలో సబ్ కోర్టు ఏర్పాటు చేయాల్సిందేనని పత్తికొండ బార్ అసోసియేషన్ అధ్యక్షులు మధుబాబు, సీనియర్ న్యాయవాదులు కారప్ప, ఎల్లారెడ్డి,సత్యనారాయణ డిమాండ్ చేశారు. గురువారం పత్తికొండ బార్ అసోసియేషన్ అధ్యక్షులు మధుబాబు ఆధ్వర్యంలో ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నుండి నాలుగు స్తంభాల వరకు న్యాయవాదులు కాలినడకతో వచ్చి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... 2014 శ్రీబాగ్ ఒడంబడిక ప్రకారం రాయలసీమ ముఖద్వారం అయిన కర్నూలులో శాశ్వత హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ హోసూరు పర్యటనలో 90 రోజుల్లో కర్నూల్ కి శాశ్వత హైకోర్టు బెంచ్ తీసుకొస్తామని చెప్పారని గుర్తు చేశారు. కర్నూలు, అనంతపురం, కడప జిల్లాల ప్రజలు సుదూర ప్రాంతంలో ఉన్న విజయవాడ హైకోర్టుకు వెళ్లాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించి కర్నూలులో శాశ్వత హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని కోరారు. గతంలో డివిజన్ కేంద్రమైన పత్తికొండలో సబ్ కోర్టు ఏర్పాటు కోసం ఎమ్మెల్యే కేఈ శ్యాం కుమార్ లా-మినిస్టర్ గారిని కలిసి వివరించారని, కానీ లా మినిస్టర్ ఇప్పటివరకు సబ్ కోర్ట్ గురించి ఎటువంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. అందువల్ల పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యామ్ కుమార్ చొరవ చూపి పత్తికొండలో సబ్ కోర్ట్ ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే కర్నూలులో శాశ్వత హైకోర్టు బెంచ్ ఏర్పాటు కోసం కర్నూల్ బార్ అసోసియేషన్ నేతృత్వంలో వివిధ దశలో నిరసన, ధర్నా కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కృష్ణయ్య, దామోదరాచారి, రవి ప్రకాష్, నాగభూషణం రెడ్డి, నెట్టేకల్లు, రవి, నరసరావు, కబీర్, ఇలియాస్, నరసింహులు, వాసు, సుధా కృష్ణ, మున్నయ్య, అరుణ్, అలీ, శ్రీనివాసరెడ్డి, వీరస్వామి, మధు, సాంబ, నాగరాజు, వీరేష్, బషీర్, రామంజి, లక్ష్మన్న, ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా తెలుగుదేశం జిల్లా ఉపాధ్యక్షులు సాంబశివరెడ్డి జన్మదిన వేడుకలు

## కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నా నాయకులు....



పత్తికొండ్7 ఆగస్ట్..20 : పత్తికొండ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు జిల్లా ఉపాధ్యక్షులు కే.సాంబశివరెడ్డి 79వ జన్మదిన వేడుకలను తెలుగుదేశం పార్టీ నాయకులు మాదాసి మాదారి కురువ ఎస్సీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షులు కె.పి.బ్రహ్మయ్య, మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ ప్రమోద్ రెడ్డి లు ఆధ్వర్యంలో గురువారం ఆయనకు శాలువా,పూలదండలు వేసి ఘనంగా సత్కరించి పెద్ద ఎత్తున కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.అనంతరం వారు మాట్లాడుతూ పత్తికొండ మండలంలో తెలుగుదేశం పార్టీ కోసం నిరంకుశలుగా పనిచేసి పార్టీ నాయకులకు కార్యకర్తలకు ఎలాంటి సమస్య వచ్చిన వారికి అండదండలుగా ఉంటూ పార్టీని ముందుండి నడిపిస్తూ వ్యక్తిని కొనియాడారు.కావున ఇలాంటి జన్మదిన వేడుకలను మరెన్నో జరుపుకోవాలని ఆ భగవంతుని మనసారా ఆశీర్వదించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు భాస్కర్.108 జిల్లా ఉపాధ్యక్షులు మహమ్మద్ ఆలీ,మాదాసి, మాదారి,కురవ ఎస్సీ సంక్షేమ సంఘం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మైలార్,గోవింద్,తదితరులు పాల్గొన్నారు.

# నాడు రహదారులు అధ్వానం గుంతల మయం

## నేడు అద్దంలా రహదారులు అభివృద్ధి ....

## చంద్రబాబు మార్కు పాలన...శరవేగంగా రోడ్ల నిర్మాణం....

బాపట్ల జిల్లా ఇన్చార్జి రేపల్లె ఆగస్టు 20 : రహదారులే అభివృద్ధికి దిక్సూచి అని నమ్మే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సాధ్యంలో కూటమి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా రోడ్ల నిర్మాణాన్ని శరవేగంగా చేపడుతూ ఉంది పల్లెలు పట్నాలు అనే తేడా లేకుండా ప్రతి రహదారిని ఆనందంగా నాణ్యంగా తీర్చిదిద్దుతున్నారు. గతంలో దెబ్బతిన్న రోడ్లకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మత్తులు చేయిస్తూ రవాణా వ్యవస్థను బలోపేతం చేస్తున్నారు చంద్రబాబు విజన్ కోటమి ప్రభుత్వ పట్టుదలతో రాష్ట్ర మౌలిక సదుపాయాల కల్పనలో సరికొత్త ప్రగతిని సాధిస్తున్నది అందులో భాగంగా రేపల్లె నియోజకవర్గం లోని తీర ప్రాంత రహదారులు నేడు అర్థంలా అభివృద్ధి చెందుతున్నాయి గత వైసిపి ప్రభుత్వం పాలనలో రహదారులన్నీ అధ్వానం గుంతల మయంగా ఉండి ప్రజలు వాహనదారులు నానా ఇబ్బందులు పడ్డారు రేపల్లె నియోజవర్గంలో మంత్రి అనగాని సత్య ప్రసాద్ చొరవతో తీర ప్రాంతంలో రహదారులన్నీ కోట్లాది రూపాయలు నిధులతో అభివృద్ధి చెందుతున్నాయి పల్లెలు పట్టణాలు అనే తేడా లేకుండా ప్రతి రహదారిని అందంగా నాణ్యంగా తీర్చిదిద్దుతున్నారు అందులో భాగంగా రేపల్లె పట్టణంలోనూ మండలంలోని ఉప్పూడి గుడ్డికాయలంక పెనుమూడి నుండి వయా అడవి పాలెం రాజు కాలువ మీదగా లంకెవాని దిబ్బ వరకు సుమారు 95 కోట్ల రూపాయలతో రహదారులను అభివృద్ధి చేస్తున్నారు ఇప్పటికే రేపల్లె నుండి వయా సజ్జ వారి పాలెం మీదుగా నిజాంపట్నం వరకు సుమారు 9 కోట్ల 75 లక్షల రూపాయలతో రహదారిని అందంగా నాణ్యంగా అర్థం లాగా అభివృద్ధి చేశారు నగరం నిజాంపట్నం చెరుకుపల్లి మండలాల పరిధిలో పలు గ్రామాల్లో సిసి రోడ్లు అభివృద్ధి చేస్తున్నారు అదేవిధంగా రేపల్లె మండలంలోని పలు గ్రామాల్లో సిసి రోడ్లతో పాటు గత ప్రభుత్వంలో పూర్తిగా విస్మరించిన గ్రామాలను కలుపుతూ ఉన్న రహదారులను కోట్లాది రూపాయలు నిధులతో అభివృద్ధి చేస్తున్నారు నాడు గుంతల మయంగా అధ్వానంగా ఉన్న రేపల్లె తీర ప్రాంతంలో రహదారులు నాటి కూటమి ప్రభుత్వం 2 6.నెలల పరిపాలనలో రహదారులు నిర్మాణాన్ని శరవేగంగా అభివృద్ధి జరుగుతూ ఉన్నాయి. దీంతో తీర ప్రాంత ప్రజలు వాహనదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు

# పట్నంలో స్వైర విహారం గుంపులు గుంపులు చేస్తున్న భైరవులు

## కుక్క కాటుకు పలువురికి గాయాలు

## చోద్యం చూస్తున్న మున్సిపల్ శానిటేషన్ అధికారులు

## బెంబేలెత్తుతున్న పట్టణ ప్రజలు చిన్నారులు

రేపల్లె టౌన్ ... ఆగస్టు 20 : పట్నంలో ఏ వీధిలో చూసిన గుంపులు గుంపులుగా బౌ బౌ అంటూ కుక్కలు స్వైర విహారం చేస్తూ వీధులలో చిన్నారుల వెంటపడి కలవడంతో కొంతమంది చిన్నారులు కుక్కకాటుకు బలి అయ్యి ప్రభుత్వ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స చేయించుకుంటున్నారు ఈ వీధిలో చూసిన కుక్కలు గుంపులు గుంపులుగా స్వైర విహారం చేస్తూ కనపడిన వారిని పిచ్చి కుక్కలు వెంటపడి మరీ కరుస్తూ ప్రజలను చిన్నారులను విద్యార్థులను బెంబేలెత్తిస్తున్నాయి గత కొద్ది రోజులుగా పట్నంలోని ఇసుకపల్లి బేతపూడి సెంటర్లలో ఓల్డ్ టౌన్ ఇస్లాంపేట గ్రామ దేవత పాతపట్నం అంకమ్మ చెట్టు పెనుమూడి రోడ్డు యాదవుల బజారులు లలో కుక్కలు కొంతమంది చిన్నారులను పెద్దవారిని కలవడంతో వారు గాయాలు పాలైన సంఘటనలు ఉన్నాయని ప్రజలు బహిరంగంగా చెబుతున్నారు ఈ విషయాన్ని స్థానిక మున్సిపల్ అధికారులకు శానిటేషన్ కార్యదర్శులకు తెలియజేసినప్పటికీ వారు ఉన్నతాధికారుల సూచనలు మేరకు కుక్కలను చంపవద్దని పట్టుకోవద్దని చెప్పినట్లు ప్రజలు బహిరంగంగా అంటున్నారు ఎక్కడ చూసినా బౌ బౌ అంటూ పలు వార్డుల్లో వీధులలో పాదచారులు వాహన చోదకులు వెంట కుక్క లు పడి కరుస్తున్న సందర్భాలు అనేక ఉన్నాయి ముఖ్యంగా విద్యాసంస్థలు కు వెళుతున్న విద్యార్థిని విద్యార్థులు వెంట పడి కరుస్తూ ఉండటంతో వాళ్లు భయభ్రాంతులకు గురి అవుతున్నారు ముఖ్యంగా నారాయణ చైతన్య భాష్యం రామకృష్ణ పబ్లిక్ స్కూల్ రామకృష్ణ విద్యానిలయం సంస్థల వీధులలో గుంపులు గుంపులుగా కుక్కలు ఉండటంతో అవి కరుస్తాయని భయపడి కొంతమంది విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులకు చెప్పి వారిని కూడా వెంటబెట్టుకుని విద్యాసంస్థలకు వస్తున్న సందర్భాలు ఉన్నాయని విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు చెబుతున్నారు పట్టణంలో యదేచ్ఛగా సంచరిస్తున్న కుక్కలను అదుపు చేయాలని మున్సిపల్ శానిటేషన్ అధికారులను సిబ్బందిని పట్టణ ప్రజలు పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కోరుతున్నారు ..

# శిథిలావస్థలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ శాస్త్ర పరిశోధనాలయం పునరుద్ధరించాలని ప్రజలు వినతి



బాపట్ల జిల్లా రేపల్లె టౌన్ .. ఆగస్టు 20...: రేపల్లె ప్రభుత్వ జూనియర్ కళాశాలకు అనుబంధంగా నిర్మించిన శాస్త్ర పరిశోధనాలయం ప్రస్తుతం శిథిలావస్థకు చేరి మూతపడిన పరిస్థితి పట్టణ ప్రజలను, విద్యార్థులను కలవరపెడుతోంది. ఒకప్పుడు ఇంటర్మీడియట్ బైపీసీ, ఎంపీసీ, విద్యార్థుల ప్రాక్టికల్స్‌కు కేంద్రబిందువుగా నిలిచిన ఈ పరిశోధనాలయం గత 15 ఏళ్లుగా నిర్లక్ష్యానికి గురికావడంతో భవనం చెట్టు పిచ్చి మొక్కలు ఇంగ్లీష్ తుమ్మలు, మొలిచి పాములకు, కుక్కలకు, పందులకు నిలయంగా నిరుపయోగంగా మారింది.కీర్తిశేషులు పుట్టగుంట వెంకటరామయ్య జ్ఞాపకార్థం, రేపల్లె మండలం నల్లూరు గ్రామానికి చెందిన దాత పుట్టగుంట రాజగోపాల్ రావు లక్షలాది రూపాయలు వ్యయపరచి రెండంతస్తుల భవనాన్ని నిర్మించి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు అందజేశారు. విద్యార్థుల శాస్త్రీయ విజ్ఞానాభివృద్ధి లక్ష్యంగా నిర్మించిన ఈ భవనంలో ఇంటర్మీడియట్ మొదటి, రెండవ సంవత్సరం బయోపీసీ విద్యార్థులు ప్రాక్టికల్స్ నిర్వహించేవారు.ఈ పరిశోధనాలయం ద్వారా అనేకమంది విద్యార్థులు ఉన్నత విద్యలు అభ్యసించి ప్రముఖ వైద్యులుగా, ప్రభుత్వ మరియు ప్రైవేట్ రంగాలలో ఉన్నత స్థానాల్లో ఎదిగారు. అయితే కాలక్రమేణా కళాశాల యాజమాన్యం సరైన శ్రద్ధ చూపకపోవడంతో భవనం మరమ్మతు లకు నోచుకోకపోవడంతో శిథిలావస్థకు చేరి మూతపడింది. గత 15 సంవత్సరాలుగా ఈ పరిశోధనాలయం ఉపయోగంలో లేకపోవడం పట్ల పట్టణ ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని తక్షణమే మరమ్మతులు చేపట్టి పూర్వ వైభవాన్ని తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.రేపల్లె శాసనసభ్యుడు, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ చొరవ తీసుకొని నిధులు మంజూరు చేసి పరిశోధనాలయాన్ని పునరుద్ధరించి విద్యార్థులకు తిరిగి అందుబాటులోకి తీసుకురావాలని విద్యార్థులు, ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

Pulisher,Owner and Editor kureti satish, printed by Teja cards and stationery ground floor 26-25-2durgi vari veedhi,opp Inox theater Gandhi nagar Vijayawada ,Andra Pradesh 520003.PRGS Nembar: APTEL/26/A4813, Editor: kureti satish,cell number:9866640784,H. No:21-651a,near Suvarna Kalyana mandapam,parasupeta machilipatnam Krishna Distric, Andra Pradesh.521001